

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : ఆదివారం 6:25(సాయంత్రం)
సెహరీ : సోమవారం 4:51 (ఉదయం)



పేరుకే శ్రీశైలం

- పరిపాలన అంతా ఆత్మకూరు నుంచే
- ఎన్నికల ప్రక్రియ కూడా..
- 2009లో ఆత్మకూరు నుంచి శ్రీశైలంగా మార్పు

ఆత్మకూరు, మార్చి 30:
ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే ఆత్మకూరు ప్రాంతానికి ఒక ప్రత్యేక గుర్తింపు వుంది. జిల్లా సరిహద్దు ప్రాంతమే కాకుండా సమీపంలోనే నల్లమల అడవులు, కృష్ణానది పరవళ్లు, ద్వాదశ జ్యోతిర్లింగాల్లో, అష్టాదశ శక్తిపీఠాల్లో ఒకటైన శ్రీశైల క్షేత్రంతోపాటు తెలుగు రాష్ట్రాలకు వెలుగునిచ్చే శ్రీశైలం విద్యుత్ ఉత్పాదక ప్రాజెక్ట్ కూడా ఆత్మకూరు సబ్ డివిజన్ పరిధిలోనే ఉండేవి. ఇంత చారిత్రక నేపథ్యం ఉన్న ఆత్మకూరు ప్రాంతం ఒకప్పుడు నందికొట్కూరు తాలుకా పరిధిలోనే కొనసాగింది. 1978లో ఆత్మకూరును ప్రత్యేక నియోజకవర్గంగా ఎంపిక చేసి అందులో వెలుగోడు, పాములపాడు, ఆత్మకూరు, శ్రీశైలం, గడివేముల మండలాలతోపాటు కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాలను చేర్చారు. ఆత్మకూరు నియోజకవర్గంగా ఏర్పాటైన తొలిసారే ఈ ప్రాంతానికి మంత్రి పదవి వరించింది. కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి గెలిచిన ఆత్మకూరు వెంగళరెడ్డికి అప్పట్లో ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి కేబినెట్‌లో రవాణా శాఖ మంత్రిగా అవకాశం లభించింది. ఈయన హయాంలోనే కర్నూలు కొత్త బస్టాండ్ ప్రాంగణం ఎంపిక, భవన నిర్మాణాలు జరిగాయి. ఈ క్రమంలోనే 1984లో అప్పటి టీడీపీ తరపున గెలిచిన దివంగత బుడ్డా వెంగళరెడ్డిని కూడా అప్పట్లో ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు రాష్ట్ర కరువు నివారణ సంఘం చైర్మన్ (డిప్యూటీ కేబినెట్ స్థాయి)గా నియమించారు. ఇలా 31 ఏళ్లపాటు రాష్ట్రంలోనే ఒక ప్రత్యేకతను సంతరించుకున్న ఆత్మకూరు నియోజకవర్గంలో 2009లో శ్రీశైల నియోజకవర్గంగా రూపాంతరం చెందింది.

పరిపాలనలో ఆత్మకూరు కీలకం

భౌగోళిక పరిస్థితుల కారణంగా ఆత్మకూరు నియోజకవర్గం శ్రీశైలం నియోజకవర్గంగా ఏర్పడినప్పటికీ ఆత్మకూరు పట్టణమే పరిపాలనకు కీలకంగా మారింది. నియోజకవర్గానికి సంబంధించిన పలు కీలక శాఖల కార్యాలయాలు కూడా ఇక్కడే ఉన్నాయి. అంతేకాదు శ్రీశైలం నియోజకవర్గ స్థాయిలో అధికారిక, రాజకీయ కార్యక్రమాలు ఏవీ జరిగినా ఆత్మకూరు కేంద్రంగానే నిర్వహిస్తున్నారు. దీనికితోడు శ్రీశైలం సుదూర ప్రాంతంలో ఉండటంతో ఆయా మండలాల ప్రజలకు అనువుగా ఉండేందుకు వీలుగా ఆయా రాజకీయ పార్టీల నాయకులు తమ నియోజకవర్గ కార్యాలయాలు ఆత్మకూరులోనే ఏర్పాటు చేశారు. అదేవిధంగా ప్రస్తుతం జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా శ్రీశైలం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం కూడా ఆత్మకూరులోనే ఉంది. అధికారిక సమావేశాలు, రాజకీయ పార్టీల సమావేశాలు, రాజకీయ నాయకుల పర్యటనలు కూడా ఆత్మకూరులోనే నిర్వర్తిస్తున్నారు. అదేవిధంగా ఎన్నికల్లో ప్రచార అనుమతులు, ఇతర కార్యకలాపాలన్నీ ఆత్మకూరులోనే సాగుతున్నాయి. ఏదిఏమైనా.. శ్రీశైలం నియోజకవర్గం పేరు దేశవ్యాప్తంగా ఎంతో గుర్తింపు ఉన్నప్పటికీ హెడ్‌క్వార్టర్ మాత్రం ఆత్మకూరే ఉండటం గమనార్హం





2009లో నియోజకవర్గాల పునర్విభజనతో శ్రీశైలంగా మార్పు

మూడు దశాబ్దాలకు పైగా నియోజకవర్గంగా ఉన్న ఆత్మకూరు 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా రూపురేఖలు మారిపోయాయి. భౌగోళిక సమూనాను పరిగణలోకి తీసుకుని చేసిన పునర్విభజనలో భాగంగా ఆత్మకూరు నియోజకవర్గంలోని పాములపాడు, కొత్తపల్లి మండలాలు నందికొట్కూరు నియోజకవర్గంలోకి వెళ్లాయి. గడివేముల మండలం పాణ్యం నియోజకవర్గంలో కలిపేశారు. ఆత్మకూరు, వెలుగోడు, శ్రీశైలం మండలాలతోపాటు నంద్యాల నియోజకవర్గంలోని మహానంది, బండిఆత్మకూరు మండలాలను కలిపి శ్రీశైల నియోజకవర్గంగా మార్చారు. అయితే పరిపాలన, ప్రజల ఇబ్బందులను పరిగణలోకి తీసుకోకుండా చేపట్టిన పునర్విభజనపై అప్పట్లో విమర్శలు వచ్చాయి. పేరుకు శ్రీశైలం నియోజకవర్గంగా ఉన్నప్పటికీ పరిపాలనకు కేంద్రంగా ఆత్మకూరే కొనసాగుతోంది. ఒక విధంగా చెప్పాలంటే శ్రీశైల నియోజకవర్గంలోని ఆత్మకూరు నుంచి శ్రీశైలానికి ప్రకాశం జిల్లాను దాటి వెళ్లాల్సి ఉంటుంది. అంతేకాదు జిల్లాలోనే అత్యంత పొడవైన నియోజకవర్గంగా శ్రీశైలం గుర్తింపు దక్కించుకోవడం గమనార్హం. కాగా నియోజకవర్గంలో పరిధి ఎక్కువగా ఉండటంతో పరిపాలనకు, రాజకీయాలు సాగించేందుకు అటు అధికారులకు, ఇటు రాజకీయ నాయకులకు తిప్పలు తప్పడం లేదు.

సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా

- తప్పుడు వార్తలు, ఆన్‌లైన్ వేధింపులపై చర్యలు
- ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి



నంద్యాల క్రైం, మార్చి 30: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న కారణంగా ఆన్‌లైన్ వేధింపులు, సోషల్ మీడియా ట్రోలింగ్‌లు, సోషల్ మీడియా ద్వారా తప్పుడు వార్తల ప్రచారాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు నంద్యాల ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ (ట్విటర్) గ్రూపుల్లో తప్పుడు వార్తలు పోస్ట్ చేసే వారిపై చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. అభ్యంతరకర, తప్పుడు వార్త, వదంతులపై స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. గ్రూపుల్లోని సభ్యులు ఎవరైనా అభ్యంతరకరంగా ప్రవర్తిస్తే గ్రూపు నుంచి తొలగించాలని సూచించారు. వివాదాస్పద పోస్టింగ్‌కు సంబంధించి అడ్మిన్ ఎలాంటి చర్యలు తీసుకోకుంటే అతడిపై పోలీసులు చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఒకవేళ అడ్మిన్ వివాదాస్పద అంశాన్ని పోస్ట్ చేస్తే ఐటీ చట్టం, ఐపీసీ సెక్షన్ 153(ఎ)కింద మూడు నుంచి అయిదేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంటుందని తెలిపారు. కుల, మత, వర్గాల మధ్య విభేదాలు, విద్వేషాలకు దారితీసే పోస్టులు పెట్టడం, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం లాంటివి పోస్ట్ చేయకూడదని, షేర్ కూడా చేయకూడదని సూచించారు. అలాగే సోషల్ మీడియా ట్రోలింగ్‌లు, ఆన్‌లైన్ వేధింపులకు పాల్పడటం, మార్ఫింగ్ చేసిన ఫోటోలు, వీడియోలు పెట్టడం వంటివి చేయకూడదని అన్నారు. ఉద్దేశపూర్వకంగా ఒక మహిళను లక్ష్యంగా చేసుకొని వేధిస్తే తీవ్రమైన నేరంగా పరిగణిస్తామని హెచ్చరించారు. అలా ఎవరైనా చేస్తే వాట్సాప్ నెంబర్ 9154987034కు తెలియజేయాలని కోరారు.

జిల్లా కోర్టులో వర్క్‌షాపు ప్రారంభం

- కేసులపై అవగాహన కల్పించిన హైకోర్టు న్యాయమూర్తి



వర్క్‌షాపులో పాల్గొన్న రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కేసురేష్ రెడ్డి

కర్నూలు(లీగల్), మార్చి 30: ఉమ్మడి కర్నూలు జిల్లా న్యాయాధికారుల వర్క్‌షాపును రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కే సురేష్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. సివిల్ దావాలపై అవగాహన కల్పించేందుకుగాను ఈ వర్క్‌షాపును ఏర్పాటు చేశారు. ఈ వర్క్‌షాపులో సివిల్ కేసుల దాఖలు, వాటి పరిశీలన, కేసుల పరిష్కారంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి హైకోర్టు న్యాయమూర్తి ఇతర జిల్లా న్యాయాధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ జ్యుడిషియల్ అకాడమీ అదనపు డైరెక్టర్ జి.చక్రవర్తి, కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎన్.శ్రీనివాసరావు, మొదటి అదనపు జిల్లా జడ్జి ఎ.శ్రీనివాసకుమార్, అదనపు జిల్లా జడ్జిలు పీజే సుధా, పి.వాసు, పి.పాండురంగారెడ్డి, జి.రాంభూపాల్ రెడ్డి, బి.సునీత, ఎంవీ హరినాథ్, రిటైర్డు జిల్లా జడ్జి శివప్రసాద్‌లతోపాటు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని న్యాయాధికారులు పాల్గొన్నారు.

మాధవుడి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కోడుమూరు(రూరల్), మార్చి 30: మండలంలోని గోరంట్ల లక్ష్మీమాధవుడి రథోత్సవం శనివారం సాయంత్రం వైభవంగా జరిగింది. ముస్తాబు చేసిన రథంపై కొలువుదీరిన మాధవస్వామి దేవేరులతో ఊరేగారు. అనంతరం రథాన్ని భక్తులు ఎదురు మండపం వరకు లాగి తిరిగి రథ మండపానికి చేర్చారు. ఈ వేడుకను తిలకించేందుకు నలుమూలల నుంచి భక్తులు తరలి వచ్చారు. తేరుబజారులో గోవింద నామస్మరణ మార్మోగింది. సీఐ మన్సూరుద్దీన్ ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు.

బుగ్గనను ఓడించడమే లక్ష్యం

- డోన్, బనగానపల్లె అభ్యర్థులు కోట్ల, బీసీ
- ధర్మవరం సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం



టీడీపీ ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, బీసీ జనార్దన్ రెడ్డి, బైరెడ్డి శబరి, మల్లెల రాజశేఖర్, ధర్మవరం సుబ్బారెడ్డి తదితరులు

డోన్, మార్చి 30: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు డోన్ నియోజకవర్గంలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిని ఓడించడమే లక్ష్యమని కేంద్ర మాజీ మంత్రి, డోన్ అసెంబ్లీ టీడీపీ కూటమి అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, బనగానపల్లె అభ్యర్థి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ ఎదురుగా పాత టీడీపీ కార్యాలయం వద్ద రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమావేశానికి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, బీసీ జనార్దన్ రెడ్డి, నంద్యాల పార్లమెంటు టీడీపీ అభ్యర్థి బైరెడ్డి శబరి, పార్టీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, యువ నేత కోట్ల రాఘవేంద్రరెడ్డి హాజరయ్యారు. ఇటీవల చంద్రబాబు వద్ద కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, సుబ్బారెడ్డిల మధ్య సయోధ్య కుదిర్చిన తర్వాత మొదటి సారి ఈ సమావేశం నిర్వహించారు. కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ ధర్మవరం సుబ్బారెడ్డిని తమ కుటుంబ సభ్యుడిగా భావిస్తున్నామని, ఆయన ఎదుగుదలకు ఎన్నో సహకారాలు అందించామని తెలిపారు. డోన్ అసెంబ్లీ నుంచి పోటీ చేయాలని చంద్రబాబు కోరడంతోనే తాను ఇక్కడకు రావాల్సి వచ్చిందన్నారు. మూడేళ్లపాటు కష్టపడిన సుబ్బారెడ్డికి బాధ ఉండవచ్చని, తాను కూడా కర్నూలు పార్లమెంటు వదిలేసి రావడానికి ఎంతో బాధపడ్డానని తెలిపారు. సుబ్బారెడ్డికి పార్టీ అధిష్ఠానం ఏ హామీలైతే ఇచ్చిందో.. వాటిని నెరవేరుస్తామని భరోసా ఇచ్చారు. మంత్రి బుగ్గన నిజంగా అభివృద్ధి చేసి ఉంటే ధైర్యంగా ప్రజల్లో ఎందుకు తిరగలేకపోతున్నారని ప్రశ్నించారు. వైఎస్ జగన్ సీఎం పదవిని అడ్డం పెట్టుకుని రూ.లక్షల కోట్లు సంపాదిస్తే ఆర్థిక మంత్రి పదవిని అడ్డం పెట్టుకుని బుగ్గన సిమెంటు ఫ్యాక్టరీలను స్వాధీనం చేసుకున్నాడని ఆరోపించారు. బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ఆదేశానుసారం పార్టీ అభివృద్ధి కోసం పని చేస్తున్నామన్నారు. డోన్ మంత్రి బుగ్గనను ఓడించి టీడీపీ జెండాను ఎగురవేయాలన్న లక్ష్యంతోనే అందరం పని చేస్తున్నామని తెలిపారు. నంద్యాల పార్లమెంటు టీడీపీ అభ్యర్థి బైరెడ్డి శబరి మాట్లాడుతూ వైసీపీ దోపిడీ రాజ్యాన్ని కూకటి వేళ్లతో పెకిలించి టీడీపీని గెలిపించుకుందామన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ డోన్ నియోజకవర్గంలో మంత్రి బుగ్గనను ఓడించాలన్న చంద్రబాబు ఆశయం నెరవేరేలా అందరం కలిసి పని చేద్దామని అన్నారు. డోన్‌లో టీడీపీకి రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీ వచ్చేలా కార్యకర్తలంతా కసితో కలిసి పని చేయాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆర్ఈ రాఘవేంద్ర, పట్టణ పార్టీ అధ్యక్షులు సీఎం శ్రీనివాసులు, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గంధం శ్రీనివాసులు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ప్రజావైద్యశాల మల్లికార్జున, యువ నాయకులు ధర్మవరం గౌతమ్ రెడ్డి, భరత్ రెడ్డి, ఆలా మల్లికార్జున రెడ్డి, తూర్పు లింగారెడ్డి, అభిరెడ్డిపల్లె గోవిందు, సుదర్శన్, సుంకయ్య, షేక్షావలి చౌదరి, పెద్దపూదిల్ల ప్రసాద్ రెడ్డి, అంకిరెడ్డి, ఎర్రమల నాయుడు, చక్రపాణిగౌడు, అజీజ్, సర్పంచ్ రామిరెడ్డి, జయన్న యాదవ్, మధుసూదన్ రెడ్డి, కొచ్చెర్వు రామాంజనేయులు, కమలాపురం రమేష్ పాల్గొన్నారు.

08514-244424కు ఫోన్ చేయండి

- తాగునీటి సమస్య పరిష్కరిస్తాం
- కలెక్టర్ డా.శ్రీనివాసులు

నంద్యాల (కల్చరల్), మార్చి 30: వేసవి కాలంలో తాగు నీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్‌ను కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు ఆదేశించారు. తాగునీటి సమస్యల పరిష్కారా నికి ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కార్యాలయంలో ఫిర్యాదులు విభాగం ఏర్పాటు చేశామని చెప్పారు. జిల్లాలో ఎక్కడ తాగునీటి సమస్య ఏర్పడినా 08514-244424కు కాల్ చేయాలని కోరారు. సంబంధిత అధికారులతో తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. సీపీడబ్ల్యూఎస్ స్కీములన్నీ సక్రమంగా పని చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దేశించారు. శ్రీశైలం మహా పుణ్యక్షేత్రంలో ఉగాది మహోత్సవాలు ఘనంగా నిర్వహించాలని ఈవోను ఆదేశించారు. వచ్చే నెల 6 నుంచి 10వ తేదీ వరకు జరిగే ఉగాది మహోత్సవాల ఏర్పాట్లపై దేవస్థానం కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు శనివారం కలెక్టర్‌ను సంప్రదించారు. ప్రధానంగా తాగునీరు, పారిశుధ్యం, పార్కింగ్ ప్రదేశాలు, భక్తుల దర్శన క్యూలైన్లు, లడ్డూ ప్రసాద కౌంటర్లు తదితరాలపై దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు.

ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు వంద రోజుల పని కల్పించాలి

మహానంది: ఎస్సీ ఎస్టీ కుటుంబాలకు ఉపాధి హామీ పథకం కింద వంద రోజులు పనులు కల్పించాలని కలెక్టర్ శ్రీనివాసులు సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. శనివారం మహానంది సమీపంలోని అటవీ సెంట్రల్ నర్సరీని కలెక్టర్ పరిశీలించారు. అంతకుముందు మండలంలోని తమ్మడపల్లి వద్ద జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా నీటి యాజమాన్య పథకం ఉప సంచాలకులు రామచంద్రారెడ్డి, నంద్యాల క్లస్టర్ ఏపీడీ బాలాజి నాయక్, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, ఈవోఆర్డీ శివనాగజ్యోతి పాల్గొన్నారు.



మహానందిలోని అటవీ సెంట్రల్ నర్సరీని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీనివాసులు

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి

గౌరు చరిత



మాట్లాడుతున్న పాణ్యం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గౌరుచరిత

గడివేముల, మార్చి 30: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పాణ్యం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గౌరు చరిత అన్నారు. మండల కేంద్రంలో శనివారం నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, నంద్యాల పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి బైరెడ్డి శబరి, టీడీపీ నాయకుడు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డితో కలిసి పాణ్యం నియోజకవర్గ టీడీపీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పాణ్యం నియోజకవర్గంలో కబ్జాలు ఎక్కువయ్యాయని ఆరోపించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని అన్నారు. బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో జగ్గు బ్రాండ్లను విక్రయిస్తూ జలగల మాదిరి ప్రజల రక్తాన్ని తాగుతున్నారని అన్నారు. నగదు తీసుకొని మద్యం విక్రయాలు చేస్తున్నారని, ఆన్‌లైన్ పేమెంట్, గూగుల్‌పే, క్రెడిట్ కార్డులు వినియోగిస్తే రాష్ట్రంలో భారీ మద్యం కుంభకోణం బయట పడుతుందని తెలిపారు. పాణ్యం నియోజకవర్గంలో వేల ఎకరాలు కబ్జాలకు గురయ్యాయని, ఫారెస్టు గేస్ట్‌హౌస్‌ను ఆక్రమించిన ఘనత వైసీపీ నాయకులదేనని ధ్వజమెత్తారు. వక్ఫ్‌బోర్డు భూములను కొల్లగొట్టారని అన్నారు. గడివేముల, పాణ్యం, కల్లూరు, ఓర్వకల్లు మండలాల్లో రెవెన్యూ అధికారుల సహాయంతో ఒకరి భూమిని మరొకరికి బదిలీ చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీనివాసరెడ్డి, రఘురామయ్య, మాజీ జడ్పీటీసీ సీతారామిరెడ్డి, జిల్లా కో-ఆప్షన్ మాజీ మెంబర్ ఎస్ఏ రఫిక్, టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, కృష్ణయాదవ్, శ్రీనివాసయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటుతోనే భవిష్యత్

● ఓటు వేయడం అందరి బాధ్యత
● అభివృద్ధి బాటలో నడిపించే నేతలను ఎన్నుకోవాలి



కర్నూలు(కలెక్టరేట్), మార్చి 30: మన దేశంలో ప్రజాస్వామ్యం ఉందనడానికి గుర్తు ప్రతి ఐదు సంవత్సరాలకు ఎన్నికలు జరగడం. లోక్‌సభకు ఎంపీలను, అసెంబ్లీకి ఎమ్మెల్యేలను ప్రజలు తమ ఓటు ద్వారా ఎన్నుకుంటున్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి అభ్యర్థికి ఓటు హక్కును రాజ్యాంగం కల్పించింది. పార్లమెంటు, అసెంబ్లీలో బిల్లులు చట్టాలుగా కార్యరూపం దాల్చడానికి ఎమ్మెల్యేలు, ఎంపీలు ఖచ్చితంగా ఆమోదం తెలపాలి. ప్రతి ఓటరు ఈ దేశాన్ని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే అభ్యర్థిని గుర్తించి ఓటు వేసి గెలిపించాలి. ఓటు ఉన్న ప్రతి పౌరులు తమ ఓటు వేయడానికి దగ్గరలో పోలింగ్ కేంద్రం ఎక్కడ ఉందో తెలుసుకోవాలి. శనివారం నగరంలోని ఎంఆర్‌సీ కన్వెన్షన్ హాల్లో జిల్లా స్థాయిలో పీవో, ఏపీవోలకు శిక్షణా



తరగతులు అధికారులు నిర్వహించారు. మంత్రాలయం 646, ఆలూరు 765, ఎమ్మిగనూరు 680, పత్తికొండ 676, అలాగే ఏప్రిల్ 1న కోడుమూరు 827, ఆదోని 454, కర్నూలు 898, పాణ్యం 411 నియోజకవర్గాలకు సంబంధించిన పీవో, ఏపీవోలకు శిక్షణ ఇవ్వనున్నారు. నియోజకవర్గ స్థాయిలో ఏప్రిల్ 10లోపు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు.

ఎన్నికల్లో ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం బాధ్యతగా పౌరులు భావించాలి. ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు. దాన్ని వినియోగించుకోవడం బాధ్యత. అయితే ఎన్నికల ప్రక్రియ గురించి ఓటర్లకు అవగాహన ఉండాలి. అప్పుడే తమ ఓటును సరిగా వినియోగించుకోగలుగుతారు. పోలింగ్ ప్రక్రియలో వివిధ స్థాయిల్లో అధికారులు పాల్గొంటారు. ఎలా అంటే..

పోలింగ్ కేంద్రంలో..

ప్రిసైడింగ్ అధికారి (పీవో), సహాయక ప్రిసైడింగ్ అధికారి (ఏపీవో), ఓపీవోలు-4, పోలింగ్ ఏజెంట్లు, పోలింగ్ సిబ్బంది ఉంటారు.

అధికార విధులు

ప్రతి పోలింగ్ కేంద్రానికి ప్రిసైడింగ్ అధికారి (పీవో) పర్యవేక్షణ అధికా రిగా ఉంటారు. పీవో ఆధ్వర్యంలో ఏపీవో, ఓపీవోలు పని చేస్తారు. సహా యక ప్రిసైడింగ్ అధికారి ఓటరు లిస్టు, ఓటర్ల గుర్తింపు కార్డుల ను పరిశీలిస్తారు. రెండో పోలింగ్ ఆఫీసర్ ఇండెలిబుల్ ఇంక్ ఇన్ చార్జి, ఓట్ల రిజిస్టర్ ఇన్‌చార్జి, 17ఏలో ఓటరు వేలిముద్ర లేదా సంతకం తీసుకుంటా రు. మూడో పోలింగ్ ఆఫీసర్ ఓటర్ల స్లిప్ ఇన్‌చార్జి తెలుపు, పింక్ ఓటరు స్లిప్పులు ఇస్తారు. ఇండెలిబుల్ ఇంక్ మార్క్ తనిఖీ చేసా రు. నాలుగో పోలింగ్ ఆఫీసర్ లోక్‌సభ కంట్రోల్ యూనిట్ ఇన్‌చార్జి తెలు పు స్లిప్పు తీసుకుని బ్యాలెట్ రిలీజ్ చేస్తారు. ఐదో పోలింగ్ ఆఫీసర్ అసెం బ్లీ కం ట్రోల్ యూనిట్ ఇన్‌చార్జి, పింక్ స్లిప్పు తీసుకుని బ్యాలెట్ రిలీజ్ చేస్తారు.

ఓటరు గుర్తింపు కార్డు లేకుంటే

ఓటు వేసే సమయంలో ఓటరు గుర్తింపు కార్డును చూపించాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. లేదంటే 12 రకాల ప్రత్యామ్నాయ కార్డులను సూచించింది.

1) ఆధార్‌కార్డు, 2) ఉపాధి హామీ జాబ్ కార్డు, 3) బ్యాంకులు, పోస్టాఫీసులు జారీ చేసే పాస్‌బుక్, 4) హెల్త్ ఇన్సూరెన్స్ హెల్త్ కార్డు, 5) డ్రైవింగ్ లైసెన్స్, 6) పాన్ కార్డు, 7) నేషనల్ పాపులేషన్ రిజిస్ట్రార్ జారీ చేసే స్మార్ట్ కార్డు, 8) పాస్‌పోర్టు, 9) పెన్షన్ డాక్యుమెంటు, 10) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థలు జారీ చేసే గుర్తింపు కార్డులు, 11) ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు జారీ చేసే గుర్తింపు కార్డులు, 12) యూనిక్ డిసెబిలిటీ ఐడీ కార్డులు.

మాక్ పోల్ నిర్వహణ

పోలింగ్ కేంద్రంలో పీవో పోలింగ్ కేంద్రం కాకముందే పోలింగ్ ఏజెంట్ల ఆధ్వర్యంలో మాక్ పోల్ నిర్వహిస్తారు. దాదాపు మాక్‌పోల్ ద్వారా 50 ఓట్లు నమోదు చేస్తారు.

టెండర్ బ్యాలెట్

ఓటర్ పోలింగ్ స్టేషన్‌కు వచ్చి తన ఓటు అప్పటికే పోల్ అయినట్లు గుర్తిస్తే.. ఓటర్ అండర్ రూల్ 49పీ ప్రకారం టెండర్ బ్యాలెట్ కోసం అడగవచ్చు. పీవో ఓటరుపై నిజనిర్ధారణ చేసిన తర్వాత టెండరు బ్యాలెట్ పేపర్ ఇస్తారు. ఈవీఎం ద్వారా ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటు వేయడానికి ఆస్కారం ఉండదు.



చాలెంజ్ ఓటు

ఓటు వేయడానికి వచ్చిన ఏ వ్యక్తి అయినా ఓటరు కాదని భావిస్తే పోలింగ్ ఏజెంటు చాలెంజ్ చేయవచ్చు. అందుకు పోలింగ్ ఏజెంట్ ఛాలెంజ్ రుసుము రూ.2 ప్రిసైడింగ్ అధికారికి చెల్లించాలి. అధికారులు సంబంధిత ఓటరుపై నిజనిర్ధారణ చేసిన తర్వాత ఓటు వేయడానికి అనుమతిస్తారు. లేకపోతే ఆ ఓటరును పోలీసులకు అప్పగిస్తారు. ఏజెంటు చాలెంజ్ రుజువైతే తిరిగి రూ.2 ఇస్తారు.

టెస్టు ఓటు

వీవీ ప్యాట్‌లో ఓటరు తన ఓటు వేసిన తర్వాత ప్రింటర్‌లో నుండి వెలువడిన పేపర్‌స్లిప్‌లో అభ్యర్థి పేరు గుర్తు తాను వేసిన వ్యక్తికి పడలేదని అనుకున్నట్లయితే.. రూల్ 49 ఎంఏ కింద ఓటరు టెస్టు ఓటును అడగవచ్చు..

పోలింగ్ ఏజెంట్లు

పోలింగ్ కేంద్రంలో వివిధ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థుల పోలింగ్ ఏజెంట్లు ఎన్నికల ఏజెంట్ ద్వారా నియమితులవుతారు. అందుకు పోలింగ్ ఏజెంట్లు ఫారం-10కు దరఖాస్తు చేసుకోవాలి. అసెంబ్లీ నియోజకవర్గంలో నివసించే స్థానిక వ్యక్తిగా లేదా సంబంధిత పోలింగ్ స్టేషన్‌లో లేదా పొరుగున ఉన్న పోలింగ్ స్టేషన్ ప్రాంతాలలో నివాసి అయి ఉండాలి.

21న ఆదర్శ పాఠశాలలకు ప్రవేశ పరీక్ష

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 30: 2024-25 విద్యాసంవత్సరానికి గాను 6వ తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 21వ తేదీన ఆదర్శ పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామ్యేల్ శనివారం తెలిపారు. ఏప్రిల్ 21న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందని అన్నారు. దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ప్రవేశ పరీక్ష 5వ తరగతి స్థాయిలో తెలుగు, లేదా ఇంగ్లీషు మీడియాల్లో ఉంటుందని అన్నారు. ఆదర్శ పాఠశాలలు సీబీఎస్‌ఈకి అనుబంధంగా ఉన్నాయన్నారు. ఆంగ్ల మాధ్యమంలోనే బోధన జరుగుతుందన్నారు. దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 31 నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 30: పాలిటెక్నిక్ డిప్లమా కోర్సులో ప్రవేశానికి ఏప్రిల్ 27న జరిగే పాలిసెట్ ప్రవేశ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తాండ్రపాడు ఎస్‌జీపీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎంవీఎస్ఎన్ ప్రసాద్ శనివారం తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి 24వ తేదీ వరకు తాండ్రపాడు ఎస్‌జీపీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ శిక్షణతో పాటు మెటీరియల్ కూడా ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 9492403015 నెంబరును సంప్రదించాలన్నారు.

● **ప్రభుత్వ మైనార్టీ పాలిటెక్నిక్ కళాశాలలో:** ఏప్రిల్ 1 నుంచి 25వ తేదీ వరకు పాలిసెట్-2024 ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రభుత్వ మైనార్టీ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.చక్రవర్తి శనివారం తెలిపారు. ఉచిత శిక్షణకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ ఇస్తున్నట్లు తెలిపారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో ఏపీ హైకోర్టు జడ్జి



శ్రీమఠంలో ప్రదక్షిణలు చేస్తున్న ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ ఏవీ రవీంద్రబాబు

మంత్రాలయం, మార్చి 30: రాఘవేంద్ర స్వామి దర్శనార్థం మంత్రాల యం వచ్చిన ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ ఏవీ రవీంద్రబాబుకు శనివారం మహాముఖ ద్వారం వద్ద మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్ కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తి ఘనంగా స్వాగతం పలికారు. ఆయన గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘ వేంద్ర స్వామి మూల బృందావనానికి పూజలు చేశారు. మఠం పీఠాధిపతి సు బుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. ఈయన వెంట ఎస్‌ఐ గోపీనాథ్, ఏఎస్‌ఐ నాగరాజు, బిందు మాధవ్, అనంతస్వామి, ప్రకాశ్ ఆచార్, భీ మ్‌సేన్ ఆచార్, పవన్‌ఆచార్, వ్యాసరాజార్ తదితరులు పాల్గొన్నారు.

మహానంది జలశక్తిపై అధ్యయనం

● ఇక్కడి జలసంపద గురించి దేశానికంతా తెలియజేస్తాం
● ఇంటాచ్ నిపుణుడు సుమేష్ దుదాని



మహానందిలో సుమేష్ దుదాని బృందం

మహానంది, మార్చి 30 : మహానంది క్షేత్రంలోని జల శక్తిపై ఢిల్లీకి చెందిన ఇంటాచ్ (ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్స్ కల్చర్ అండ్ హెరిటేజ్) అధ్యయనం చేస్తున్నట్లు మిషన్ ఆన్ వాటర్ నిపుణుడు సుమేష్ దుదాని తెలిపారు. శనివారం మహానందిలోని అద్భుత జలసంపదను అధ్యయనం చేయడానికి ఆయన తన బృందంతో కలసి వచ్చారు. ఇందులో భాగంగా ఇక్కడి నీటి వనరులను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను ఈనెల 27న ధవళేశ్వరం బ్యారేజీ, 29న పోరుమామిళ్ళతో పాటు కంభం ట్యాంక్‌లను, చెరువులను పరిశీలించినట్లు చెప్పారు. మహానందిలోని జలసంప దను కూడ నంద్యాల చాప్టర్ కన్వీనర్ శివకుమార్‌రెడ్డితో కలసి అధ్యయనం చేశామన్నారు. మహానంది క్షేత్రంలోనే ఉన్న ఈ తరహా జలసంపద ప్రత్యేకత లను పరిశోధన చేసి దేశానికి తెలియజేస్తామని అన్నారు. ఈ విషయంపై అలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డితో కలసి చర్చించామన్నారు. ఈ కార్యక్ర మంలో బృందం సభ్యులు డాక్టర్ గెలివి సహదేవుడు, గొల్ల సుదర్శనం, మారం శేషయ్య, డాక్టర్ కిషోర్, రోటరీ సుబ్బయ్య యాదవ్, నాగరాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

● తల్లిదండ్రులకు, తమ్మునికి గాయాలు

ఓర్వకల్లు, మార్చి 30: కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి-40 పై హుశేనాపురం బస్టాండు సమీపాన గల పెట్రోల్ బంకు వద్ద శని వారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో పవన్ (3) అనే బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఓర్వకల్లు మండలం కన్నమడకల గ్రామానికి చెందిన వడ్డె పరశురాం తన భార్య జ్యోతి, ఇద్దరు కుమారులతో ద్విచక్రవాహనంపై నంద్యాల మండలం పెద్దకొ ట్టాల గ్రామంలోని బంధువుల ఇంటికెళ్లి తిరిగి స్వగ్రామానికి బయల్దే రాడు. ఆళ్లగడ్డ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నంద్యాల నుంచి కర్నూ లు వెళ్తూ ముందువైపు వెళ్తున్న పరశురాం బైక్‌ను ఢీకొట్టింది. దీంతో పెద్ద కుమారుడు పవన్ (3) తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పరశురాం, జ్యోతి, చిన్న కుమారుడు గాయపడ్డారు. ద్విచక్రవాహనం నుజ్జునుజ్జయింది. కళ్లెదుటే కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజారెడ్డి తెలిపారు.

చెరువులో పడి భక్తుడు..

మంత్రాలయం, మార్చి 30: పాదయాత్రగా శ్రీశైలం బయల్దేరిన భక్తుడు మృతి చెందాడు. కర్ణాటకలోని బెలగావి జిల్లా మాండలిగి తాలుకా ఉంచాల గ్రామానికి హనుమంతు (22) శ్రీశైలం వెళ్తూ శనివారం మండలంలోని చిలకలడోన గ్రామ సమీపంలో చెరువులో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు ఈత రాక మృతి చెందాడు. తోటి భక్తులు యువకున్ని కాపాడే ప్రయత్నం చేసినా ఫలించలేదు. అప్పటికే మృతి చెందడంతో మృతదేహాన్ని నీటి నుంచి బయటకు తీశారు. ఎస్‌ఐ గోపీనాథ్ సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామ నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతదేహాన్ని అంత్యక్రియల కోసం స్వ గ్రామానికి తరలించారు.

ఉత్తర్‌ప్రదేశ్‌లో కన్నమడకల వాసి..

ఓర్వకల్లు, మార్చి 30: మండలంలోని కన్నమడకల గ్రామానికి చెందిన పెద్ద వెంకటస్వామి (60) ఇటీవల ఉత్తరప్రదేశ్‌లో రైలు ప్రమాదానికి గురై మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పెద్ద వెంకటస్వామికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అయితే వారు పట్టించుకోకపోవడంతో ఇతర రాష్ట్రాల్లో బిక్షాటన చేస్తూ కడుపు నింపుకునేవాడు. ఇటీవల ఉత్తరప్రదేశ్‌లో రైలు నుంచి కింద పడి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుని వద్ద ఆధార్‌కార్డు ఉండటంతో ఉత్తర్‌ప్రదేశ్ పోలీసులు గుర్తించి ఓర్వకల్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు.

ఈతకు వెళ్లి యువకుడు..

సి. బెళగల్, మార్చి 30: మండలంలోని ఈర్లదిన్నె గ్రామానికి చెందిన సులోచనమ్మ, రాజు దంపతుల మూడో సంతానం దైవాదీనం (19) శనివారం తమ పొలంలో ఉన్న బావిలో ఈతకువెళ్లి నప్పుడు ఫిట్స్ రావడంతో నీటిలో మునిగి మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం జరిగింది. టీడీపీ సీనియర్ నాయకుడు ఎదు రూరు విష్ణువర్ధన్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ 10,000 ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట కోడుమూరు నియోజ కవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొగ్గుల దస్తగిరి, టీడీపీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, శేషన్న, సోమన్న, భాస్కర్ తదితరులు ఉన్నారు.

రూ.2.50 లక్షలు పట్టివేత

చాగలమర్రి, మార్చి 30: చాగలమర్రి టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన జిల్లా సరిహద్దు చెక్‌పోస్టులో ఇద్దరు వ్యక్తుల నుంచి ఎలాంటి ఆధారాలు లేని రూ.2.50 లక్షలు నగదు పట్టుబడినట్లు ఆళ్లగడ్డ రూర ల్ సీఐ హనుమంతనాయక్, ఎస్‌ఐ రమణయ్య తెలిపారు. శనివారం తెల్లవారుజామున చెక్‌పోస్టులో తనిఖీలు నిర్వహిస్తుండగా కడప జిల్లా దువ్వూరు మండలం చింతకుంట సుబ్బరాయుడు అనే వ్యక్తి ఆటోలో రూ.1.55 లక్షలు తీసుకెళ్తుండగా సీజ్ చేశామని అన్నారు. బ్రాహ్మణప ల్లె గ్రామానికి చెందిన వెంకటేశ్వర్‌రెడ్డి అనే వ్యక్తి ద్విచక్ర వాహనంలో రూ.95వేలు నగదును తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేశామని అన్నారు.

పొలం రస్తా విషయంలో ఘర్షణ

రుద్రవరం, మార్చి 30 : మండలంలోని బీరవోలు గ్రామ రెవెన్యూ పరిధిలో పొలం రస్తా విషయంలో శుక్రవారం రాత్రి వాగు వద్ద ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగిందని శనివారం ఎస్‌ఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. కుడాల వెంకటపతి అలియాస్ మార్క్ వీఆర్‌ఏ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అంగరాజ్‌కుమార్, డేవిడ్, ఆల్‌ఫ్రెడ్, చక్రపాణి, యోహాన్, చిన్న లింగమయ్య, విజయకుమార్, మనోహర్‌లపై, అంగరాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు బీరవోలు గ్రామానికి చెందిన కుడాల వెంకటపతి వీఆర్‌ఏ, యోహాను, మనోజ్, రాజశేఖర్ మొత్తం 13 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పేలిన ఆటో టైర్

ఆటో అదుపు తప్పి బోల్తా..
30 మంది కూలీలకు గాయాలు



చెల్లాచెదరుగా పడిన క్షతగాత్రులు

ఆలూరు, మార్చి 30 : ఆలూరు మండలం హత్తిబెళగల్ సమీ పంలో శనివారం టైర్ పేలడంతో ఆటో అదుపుతప్పి బోల్తా పడిం ది ఈ ప్రమాదంలో 30 మంది కూలీలు తీవ్ర గాయాలపా లయ్యారు. వారిని అంబులెన్స్ ద్వారా ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆలూరు మండలంలోని హులేబీడు గ్రామానికి చెందిన కూలీలు చిప్ప గిరిలో మిరపకాయలు తెంపేందుకు ఆటోలో వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. దస్తగిరమ్మ, శేకమ్మ, బీమలింగ మ్మ తీవ్రంగా గాయడటంతో వారిని ఆదోని ప్రభుత్వ ఆస్పత్రి కి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



బోల్తా పడిన ఆటో

కారు - ఆటో ఢీ


● ఇద్దరికి తీవ్ర గాయాలు
● మరో 8 మందికి స్వల్ప గాయాలు

ఉయ్యాలవాడ, మార్చి 30: మండలంలోని ఆర్. పాంపల్లె గ్రామ సమీపంలో శనివారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో కారు, ఆటో ఢీ కొన్నాయి. కొలిమిగుండ్ల మండలానికి చెందిన కారు అహోబిలం నుండి కొలిమిగుండ్లకు వెళుతుండగా.. రుద్రవరం మండలం టి. లింగందిన్నె గ్రామానికి చెందిన ఆటో మహిళ కూలీలతో పొలం పని ముగించుకొని తిరిగి ఇంటికి వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో ఆటోలు ఉన్న ఇద్దరు మహిళ కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. మరో 8 మందికి స్వల్ప గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను 108లో ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రైల్వే ఉద్యోగి అదృశ్యం.. కేసు నమోదు

మంత్రాలయం, మార్చి 30: మంత్రాలయం మండలంలోని కాచాపురం గ్రామానికి చెందిన సూరిపోగు నాగరాజు (36) అనే రైల్వే ఉద్యోగి అదృశ్యమయ్యాడు. నాగరాజు కాచాపురంలో ఉంటూ ఆదోని రైల్వేస్టేషన్‌లో ట్రాక్‌మెన్‌గా ఉద్యోగం చేస్తుండేవాడు. ఈ నెల 2వ తేదీన విధుల్లో భాగంగా ఉదయం 6 గంటలకు ఇంటి నుంచి వెళ్లి ఉద్యోగానికి వెళ్తున్నానని చెప్పి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి 28 రోజులు కావస్తున్నా ఇంటికి తిరిగి రాలేదు. దీంతో ఆయన భార్య ఎలిజబెత్ శనివారం మాధవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ క్రిష్ణమూర్తి తెలిపారు. తెలిపారు.

పత్తికొండ వైసీపీలో ఏకాభిప్రాయం కుదిరేనా..?



ముఖ్యమంత్రిని కలిసేందుకు వెళుతున్న ఎమ్మెల్యే శ్రీదేవి

పత్తికొండ, మార్చి 30 : పత్తికొండ వైసీపీలో ఏకాభిప్రాయం కుదిరేనా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. బస్సు యాత్రలో భాగంగా శుక్రవారం రాత్రి జగన్ పత్తికొండలో బస చేశారు. అసమ్మతి నేతలు పోచిమిరెడ్డి మురళీధర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, నాగరత్నమ్మలను పిలిపించి మాట్లాడినట్లు సమాచారం. వీరంతా ఎమ్మెల్యే శ్రీదేవితో కలిసి పనిచేసి పార్టీ గెలుపునకు పని చేస్తారా లేదా అన్నది చర్చనీయాంశంగా మారింది.

స్కూల్ అసిస్టెంట్‌పై సస్పెన్షన్ వేటు

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 30: కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులోని టెంపుల్ స్ట్రీట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీషు)గా పని చేస్తున్న జి. సత్యనారాయణను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ శనివారం తెలిపారు. కర్నూలులోని ఎంఆర్‌సీ కన్వెన్షన్ హాలులో జరిగే శిక్షణ కార్యక్రమానికి ఉపాధ్యాయుడు జి. సత్యనారాయణ ఆలస్యంగా హాజరు కావడంతో కలెక్టర్ ఆగ్రహించి, టీచర్‌ను సస్పెండ్ చేయాలని ఆదేశించారన్నారు. ఈ మేరకు జి. సత్యనారాయణను సస్పెండ్ చేసినట్లు డీఈవో తెలిపారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

ఘనంగా రన్ ఫర్ జీసస్



నంద్యాలలో పాల్గొన్న అన్ని చర్చి సంఘాల సభ్యులు

నంద్యాల (కల్చరల్), మార్చి 30: నంద్యాల పట్టణంలోని అన్ని చర్చిల సంఘాల సభ్యుల ఆధ్వర్యంలో శనివారం రన్‌ఫర్ జీసస్ పేరిట నంద్యాలలో ర్యాలీ నిర్వహించారు. క్రీస్తు పునరుద్ధానాన్ని ప్రజలకు తెలియజేయడానికి ఈ ర్యాలీ నిర్వహించినట్లు డీనరరీ చైర్మన్ జోసఫ్‌బాబు తెలిపారు. రన్‌ఫర్ జీసస్ వినూత్న సువార్త ర్యాలీ హోలీక్రాస్ కెథడ్రల్ చర్చి నుంచి శ్యామకాలువ, మున్సిపల్ ఆఫీసు, సంజీవనగర్ గేట్, శ్రీనివాస సెంటర్, పద్మావతీ నగర్, టెక్క కరెంటు ఆఫీసు, సాయిబాబానగర్, దేవనగర్ మీదుగా హోలీ క్రాస్ కెథడ్రాల్ చర్చి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రన్‌ఫర్ జీసస్ కన్వీనర్ రవీంద్రపాల్, సీఎస్ఐ చర్చి సెక్రటరీ ప్రభుదాసు, సురేష్‌పాల్, పట్టణలోని అన్ని చర్చిల సంఘాల సభ్యులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: ప్రతిఒక్కరు భక్తిభావాన్ని అలవర్చుకోవాలని రన్ ఫర్ జీసస్ కమిటీ చైర్మన్ శీలం శేషు, కన్వీనర్ ప్రభాకర్, కార్యదర్శి ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం ఈస్టర్ పండుగను పురస్కరించుకుని ఆత్మకూరు పట్టణంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా భాగంగా పట్టణంలోని ఇందిరానగర్‌లో గల సీఎస్ఐ చర్చి నుంచి గౌడ్‌సెంటర్, నంద్యాల టర్నింగ్ మీదుగా ఏబీఎం పాలెం చర్చి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. దేవునితో మానవ సంబంధాలు పెనవేసుకొని పాపపరిహారం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా చర్చిలఫాదర్లు తదితరులు ఉన్నారు.

పాణ్యం: క్రీస్తు పునరుత్థానం పర్వదిన సందర్భంగా స్థానిక షాలేము ప్రార్థనా మందిరం ఆధ్వర్యంలో శనివారం చర్చి నుంచి సీఎస్ఐ చర్చి వరకు రన్ ఫర్ జీసస్ ర్యాలీ నిర్వహించారు. పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పాస్టర్ సునీల్ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ లోక శాంతి కోసం మరణాన్ని జయించి పునరుత్థానం చెందారని అన్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ల సంఘం కార్యదర్శి యేసన్న, శాలేం ప్రార్థనా మందిరం పాస్టరు ఏలీశా, సంఘ పెద్దలు రోశన్న, సోమన్న, దైవ సేవకులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



పాములపాడులో వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

పాములపాడు, మార్చి 30: పాములపాడు పోలీస్ స్టేషన్ ఎదురుగా కర్నూలు, గుంటూరు రహదారిపై సీఐ నాగభూషణం, ఎస్ఐ అశోక్ శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల దృష్ట్యా అక్రమంగా నగదు, మద్యం, గిఫ్ట్‌లు తదితర సామగ్రిని తరలించకుండా ఉండేందుకు తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎన్నికల నియమావాళికి విరుద్ధంగా ఎలాంటి అక్రమ కార్యకలాపాలు చేపట్టరాదని, వాటిని అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీలలో ప్రత్యేక బలగాలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరు బార్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక



అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికైన వెంకటేశ్వర్లు, రవికుమార్

ఆత్మకూరు, మార్చి 30: ఆత్మకూరు బార్ అసోషియేషన్ నూతన కమిటీ శనివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. సీనియర్ న్యాయవాదులు నూర్‌అహ్మద్, పుల్లారెడ్డి ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన ఈ కమిటీ ఎన్నికలో బార్ అసోషియేషన్ అధ్యక్షుడిగా వేముల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా గొడుగు రవికుమార్, ఉపాధ్యక్షుడిగా నూర్‌అహ్మద్, సహాయ కార్యదర్శిగా సుదర్శన్, కోశాధికారిగా లక్ష్మీనారాయణ, లైబ్రేరియన్‌గా చింతలయ్య, మీడియా కార్యదర్శిగా పి.భాస్కర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ న్యాయవాదుల సంక్షేమానికి తమవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు గోవిందరెడ్డి, కేవీ చౌదరి, కేశవరెడ్డి తదితరులు ఉన్నారు.

నందికొట్కూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వెంకటరాముడు



వెంకటరాముడుకు అభినందనలు తెలుపుతున్న న్యాయవాదులు

నందికొట్కూరు, మార్చి 30: నందికొట్కూరు అడ్వకేట్ బార్ అసోసియే షన్ అధ్యక్షుడిగా వెంకటరాముడు ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి సత్యనారాయణ తెలిపారు. నందికొట్కూరు అడ్వకేట్ బార్ అసోసియేషన్ అధ్యక్ష ఎన్నికలు శనివారం కోర్టు ఆవరణలో జరిగాయి. అసోసియేషన్‌లో 61 మంది సభ్యులు ఉండగాఅందులో 56 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షులుగా సీనియర్ న్యాయవాది విజయకుమార్‌పై వెంకటరామడు విజయం సాధించారు. ఉపాధ్యక్షుడిగా సి.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా ఎం.వెంకటరమణ, కోశాధికారిగా మద్దయ్య, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉప కార్యదర్శి పదవికి వచ్చిన నామినేషన్ తిరస్కరణకు గురికావడంతో ఆ పదవిఖాళీగా ఉందని ఎన్నికల అధికారి సత్యనారాయణ తెలిపారు. అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్‌గా కుమార స్వామి, పాల్గొన్నారు. అధ్యక్షులుగా ఎన్నికైన వెంకటరాముడుకు సీనియర్ న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

'ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి'

ఆత్మకూరు, మార్చి 30: శ్రీశైలం నియోజకవర్గంలో త్వరలో సార్వత్రిక ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని శ్రీశైలం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుధారాణి సూచించారు. శనివారం ఆత్మకూరు మండలంలోని కరివేన గ్రామ సమీపంలోని డీపాల్ హైస్కూల్‌లో ఎన్నికల విధుల్లో పాల్గొనే పీవో, ఏపీవోలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గంలో మొత్తం 226 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఎక్కడైనా పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలు మొరాయిస్తే వెంటనే మార్చేందుకు అదనంగా ఈవీఎంలను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కును వినియోగించే కల్పించినట్లు వివరించారు. ఆత్మకూరు, వెలుగోడు, బండిఆత్మకూరు, శ్రీశైలం, మహానంది మండలాల తహసీల్దార్లు బాబు, విజయకుమారీ, సుమతి, గురప్ప, రామచంద్రుడు తదితరులు ఉన్నారు.

రూ.1.50 లక్షలు స్వాధీనం

పాణ్యం, మార్చి 30: మండలంలోని తమ్మరాజుపల్లె పోలీసు చెక్‌పోస్టు వద్ద శనివారం రాత్రి వాహనాల తనిఖీలో పోలీసులు రూ. 1.50 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. పాణ్యం ఎస్ఐ అశోక్ తెలిపిన వివరాలివీ.. కర్నూలు నుంచి నంద్యాల వైపు వెళ్తున్న ఏపీ 21 బీఎం 8818 నెంబరు గల కారును ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి అహమ్మద్ తనిఖీ చేశారు. డోన్ పట్టణానికి చెందిన బంగారు నగల వ్యాపారి విజయ సుబ్రహ్మణ్యం వద్ద రూ.1.50 లక్షల నగదు గుర్తించారు. ఎలాంటి పత్రాలు లేకుండా తీసుకెళ్తున్న నగదును స్వాధీనం చేసుకొని సీజ్ చేశామని చెప్పారు.

'శ్రీనివాసులు సేవలు మరువలేనివి'



శ్రీనివాసులును సన్మానిస్తున్న డీపీఆర్వో కార్యాలయ సిబ్బంది

నంద్యాల (కల్చరల్), మార్చి 30: వివాద రహితుడిగా ఏవీ సూపర్‌వైజర్ శ్రీనివాసులు విధులు నిర్వహించారని, ఆయన సేవలు మరువలేనివి అని డీపీఆర్వో మల్లికార్జునయ్య అన్నారు. జిల్లా సమాచార శాఖ కార్యాలయంలో ఏవీ సూపర్ వైజర్‌గా పనిచేస్తున్న ఆయన పదవీ విరమణ చేశారు. డీపీఆర్వో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ వరప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ రామ్‌చరణ్, టైపిస్టులు సందీప్‌కుమార్, పుల్లయ్య, డ్రైవర్ త్రినాథ్, ఇతర కార్యాలయ సిబ్బంది శ్రీనివాసులును సన్మానించారు.

'విద్యాభివృద్ధికి మంగన్న కృషి'



మంగన్నను సన్మానిస్తున్న అధికారులు

కొత్తపల్లి, మార్చి 30: విద్యాభివృద్ధికి మంగన్న కృషి చేశారని కొత్తపల్లి ఎంఈవో శ్రీరాములు అన్నారు. దుద్యాల జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం మంగన్న పదవీ విరమణ సందర్భంగా సన్మాన సభను శనివారం నిర్వహించారు. విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసిన మంగన్న సేవలు మరువలేనివని ఎంఈవో శ్రీరాములు, జడ్పీటీసీ సోముల సుధాకర్ రెడ్డి అన్నారు. ఎంఈవో-2 ఇనయతుల్లా, ఆత్మకూరు ఎంఈవో జానకీ రాముడు, రిటైర్డు హెచ్ఎంలు మక్బుల్, శివరామిరెడ్డి, ఆత్మకూరు మాజీ ఎంపీపీ మోహన్ రెడ్డి, నాయకులు కిచ్చెన్నగారి సుధాకర్ రెడ్డి, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు విద్యార్థులు పాల్గొన్నారు.

సుంకులా పరమేశ్వరి ఆలయంలో పూజలు

నంద్యాల (కల్చరల్), మార్చి 30: నంద్యాల సుంకులమ్మ వీధిలో వెలసిన సుంకులా పరమేశ్వరీ దేవాలయంలో నూతనంగా నిర్మించిన మండపంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశ స్థాపన, శివునికి అభిషేకం, గణపతి హోమం తదితర కార్యక్రమాలను పురోహితులు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ డా.రవికృష్ణ, కార్యదర్శి నాగన్న, ఉపాధ్యక్షుడు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉచిత యోగా శిక్షణ

నంద్యాల (కల్చరల్), మార్చి 30: నంద్యాల పట్టణంలోని శ్రీనివాస నగర్ మున్సిపల్ పార్కులో గల ఆయుష్ యోగా కేంద్రంలో ఉచిత యోగా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు ఆనంద్ గురూజీ తెలిపారు. ఈ శిక్షణా తరగతులు ఏప్రిల్ 1వ తేదీ నుంచి 30 వతేదీ వరకు ఉదయం 5.20 గంటల నుంచి 6.30 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఆసనములు, ప్రాణాయామం, ఎక్సర్‌సైజు, క్రియలు, ధ్యానం నేర్పించనున్నట్లు తెలిపారు. అలాగే నడుమునొప్పి, ఉబకాయం, బీపి షుగర్, థైరాయిడ్, గ్రాస్ట్రబుల్, అల్సర్, ఎసిడిటి, మలబద్దకం, ఇలా అనేక రకాల సమస్యలతో బాధపడుతున్న వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకొని వైద్య పరీక్షలు చేపించి వారి సమస్యలు తొలగించుటకు గ్రూపుల వారీగా చేసి వారికి ఆసనాలు, క్రియలు, ప్రాణాయామం, ప్రత్యేకంగా నేర్పించనున్నట్లు తెలిపారు.

'పాఠశాల పని వేళలు తగ్గించాలి'



మాట్లాడుతున్న పీఆర్‌టీయూ నాయకుడు సుబ్బరాయుడు నాయక్

గోస్పాడు, మార్చి 30: రాష్ట్రంలో వేడి తీవ్రత, వడగాల్పుల తీవ్రత ఎక్కువగా ఉండటం వలన ఏప్రిల్ 1 నుంచి పాఠశాలల పని వేళలు తగ్గించాలని పీఆర్‌టీయూ నాయకుడు సుబ్బరాయుడు నాయక్ కోరారు. శనివారం గోస్పాడులో ఆయన మాట్లాడుతూ ఉదయం 7.30 నుంచి 11 గంటల వరకు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. పాఠశాలలకు వచ్చే చిన్న పిల్లలు ఎండ తీవ్రత వల్ల ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం దీనిని దృష్టిలో ఉంచుకోవాలని అన్నారు. అదేవిధంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు పదవీ విరమణ దగ్గరలో ఉన్న వారికి, బాలింతలు, గర్భిణీలకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు సురేష్‌కుమార్, విజయరావు, రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఈవోగా వీఎల్ఎన్ రామానుజన్



బాధ్యతలు స్వీకరిస్తున్న వీఎల్ఎన్ రామానుజన్

గడివేముల, మార్చి 30: మండలంలోని గడిగరేవుల గ్రామ సమీపంలో ఉన్న దుర్గాభోగేశ్వర ఆలయ కార్యనిర్వాహణాధికారిగా శనివారం వీఎల్ఎన్ రామానుజన్ బధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఈవోగా విధులు నిర్వహించిన చంద్రశేఖర్‌రెడ్డి యాగంటి క్షేత్రానికి బదిలీ కాగా నందవరంలో ఈవోగా పని చేస్తున్న వీఎల్ఎన్ రామానుజన్ దుర్గాభోగేశ్వర ఆలయానికి బదిలీ అయ్యారు.

హుండీ ఆదాయం రూ.12.60 లక్షలు



కొత్తూరు దేవస్థానంలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

పాణ్యం, మార్చి 30: మండలంలోని కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించారు. నంద్యాల డివిజన్ దేవదాయశాఖ తనిఖీ అధికారి శశికుమార్, ఆలయ ఈవో రామకృష్ణ ఆధ్వర్యంలో లెక్కింపు చేపట్టారు. రూ.12,60,951 నగదు, 12 గ్రాముల 300 మిల్లీగ్రాములు బంగారు, కిలో 102 గ్రాముల వెండి ఆదాయం చేకూరినట్లు తెలిపారు. గత జనవరి 25వ తేదీ నుంచి నేటి వరకు వచ్చిన హుండీ ఆదాయమని చెప్పారు. ఆలయ అర్చకులు వీరయ్యస్వామి నంద్యాల సేవా సమితి మహిళలు, గ్రామ పెద్దలు మిలిటరీ సుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి, శివరామిరెడ్డి, నందివర్గం ఏపీజీబీ సిబ్బంది పాల్గొన్నారు.

'వైసీపీని ఇంటికి సాగనంపుదాం'

కొత్తపల్లి, మార్చి 30: అరాచక పాలన కొనసాగిస్తున్న వైసీపీని ఇంటికి సాగనంపుదామని కొత్తపల్లి సర్పంచ్ లక్ష్మీదేవి, గ్రామ టీడీపీ నాయకులు మోహన్ యాదవ్, మల్లికార్జున పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం గ్రామంలో సూపర్ సిక్స్ మేనిఫెస్టో పథకాలను విస్తృత ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తేనే.. బడుగు బలహీన వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. వైసీపీ పాలనతో రాష్ట్రం చిన్నాభిన్నమైందని, గ్రామాల్లో రోడ్లు లేవని అన్నారు. విద్యుత్ బిల్లులు భారీగా పెంచారన్నారు. మహిళలకు, దళితులకు రక్షణ కరువైందని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

'నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు'

పాములపాడు, మార్చి 30: గ్రామాలలో ఎవరైనా ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని సీఐ ధనుంజయ, ఎస్ఐ హెచ్చరించారు. శనివారం మండలంలోని మిట్టకందాల గ్రామంలో రానున్న ఎన్నికల దృష్ట్యా సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో కేంద్ర సాయుధ బలగాలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం



ఆర్జీఎంలో క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరిస్తున్న డైరెక్టర్

పాణ్యం, మార్చి 30: మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఆర్జీఎం ప్రీమియర్ లీగ్ క్రీడలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ క్రీడలను కళాశాల డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్ ప్రారంభించారు. 11 బ్రాంచీలకు చెందిన 400 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పురుషుల విభాగంలో బాస్కెట్ బాల్, క్రికెట్, పుట్‌బాల్, కబడ్డీ, హ్యాండ్‌బాల్, వాలీబాల్, మహిళా విభాగంలో క్రికెట్, బాస్కెట్ బాల్, టెన్నికాయిట్, త్రోబాల్ క్రీడల్లో పాల్గొన్నారు. మూడు రోజులపాటు క్రీడలు నిర్వహిస్తున్నట్లు కళాశాల పీడీ వెంకటేశ్ తెలిపారు. వ్యాయామ ఉపాధ్యా యులు వెంకటేశ్వరనాయక్, చంద్రారెడ్డి, ముని శంకర్, రాజశేఖర్, చిరంజీవి రెడ్డి పాల్గొన్నారు.

'లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి'

శ్రీశైలం, మార్చి 30: శ్రీశైలం సబ్ ట్రెజరీ పరిధిలోని పెన్షనర్లు ఆదివారం కూడా తమ లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలని సబ్‌ట్రెజరీ అధికారి ఆర్. వెంకటరమణ శనివారం తెలిపారు. సబ్‌ట్రెజరీ పరిధిలో మొత్తం 792 మంది పెన్షనర్లు ఉండగా ఇప్పటి వరకు 715 మంది మాత్రమే తమ లైఫ్‌సర్టిఫికెట్లు ఇచ్చారన్నారు. మిగిలిన 77 మంది ఆదివారం రోజు తమ లైఫ్‌సర్టిఫికెట్లను సమర్పించాలన్నారు. అందుబాటులో లేని పెన్షనర్లు తమకు అందుబాటులో ఉన్న సబ్‌ట్రెజరీ కార్యాలయం, జీవన్ ప్రమాన్, డిజిటల్ సేవా, మీసేవా కేంద్రాలలో సమర్పించాలని తెలిపారు.

గుండెపోటుతో కన్నడ భక్తుడి మృతి

- శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్తుండగా ఘటన



మృతి చెందిన శేఖరప్ప

ఆత్మకూరు రూరల్, మార్చి 30: ఆత్మకూరు మండలంలోని నల్లమల అభయారణ్యంలోని నాగలూటి వీర భద్రాలయం వద్ద ఉన్న మెట్ల మార్గంలో శేఖరప్ప (48) అనే కన్నడ భక్తుడు గుండెపోటుతో మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కర్ణాటక రాష్ట్రం కుప్పాలం జిల్లా, ఇనామల్ గ్రామానికి చెందిన శేఖరప్ప అనే కన్నడ భక్తుడు తమ గ్రామ వాసులతో కలిసి ఉగాది పండుగను పురస్కరించుకుని శ్రీశైలానికి కాలినడకన బయలుదేరారు. ఈ నేపథ్యంలో ఆత్మకూరు మండలం వెంకటాపురం గ్రామం నుండి కాలి నడకన అటవీ మార్గంలో నాగలూటి వీర భద్రాలయం చేరుకున్న తర్వాత మెట్ల మార్గంలో పయనిస్తూ ఒక్కసారిగా గుండెపోటుతో కుప్పకూలి పోయాడు. దీంతో అక్కడి భక్తులు అధికారులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలం చేరుకుని 108లో శేఖరప్పను ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో శేఖరప్ప మృతి చెందినట్లు ఎస్ఐ నారాయణ రెడ్డి తెలిపారు. ఈ మేరకు వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు ఎస్ఐ వెల్లడించారు.

మద్యం స్వాధీనం

కొత్తపల్లి, మార్చి 30: కొత్తపల్లి మండలం కొత్తమాడుగుల గ్రామంలో ఓ వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా.. అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు కొత్తపల్లి ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలివీ.. కొత్తమాడుగుల గ్రామానికి చెందిన నరసింహ గౌడు అనే వ్యక్తి గత కొంత కాలంగా మద్యం విక్రయిస్తున్నట్లు తెలిసిందన్నారు.సమాచారం మేరకు శనివారం తమ సిబ్బందితో కలిసి దాడులు చేయగా.. అతని వద్ద ఉన్న 20 అక్రమ మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం సదురు వ్యక్తిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్ఐ తెలిపారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళాలు





భక్తులకు ప్రసాదాలను అందజేస్తున్న అధికారులు

శ్రీశైలం, మార్చి 30: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న శాశ్వత అన్న ప్రసాద వితరణ పథకానికి శనివారం బెంగళూరుకు చెందిన దువ్వూరి వ్యాఘ్రి అనే భక్తురాలు రూ. 1,01,116 విరాళాన్ని సహాయ కార్యనిర్వహణాధికారి ఫణిధర్ ప్రసాద్ అందజేశారు. అలాగే హైదరాబాద్‌కు చెందిన ఆర్‌వీఆర్ చౌదరి అనే భక్తుడు రూ. 1,11,114 విరాళాన్ని పర్యవేక్షకులు హిమబిందుకు అందజేశారు. దాతకు దేవస్థానం అధికారులు స్వామివారి శేషవస్త్రం, స్వామి, అమ్మవార్ల చిత్రపటం, ప్రసాదాలను అందజేసి సత్కరించారు.

సీఏఏపై అసత్య ప్రచారం చేస్తున్న వైసీపీ: బైరెడ్డి

నందికొట్కూరు మార్చి 30: సీఏఏ విషయంలో వైసీపీ అసత్య ప్రచారాలు చేస్తూ ముస్లింలను భయభ్రాంతులకు గురిచేస్తోందని టీడీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి మండిపడ్డారు. శనివారం నందికొట్కూరులోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సిటిజన్‌షిప్ అమైండ్‌మెంట్ యాక్టు అమలైతే ముస్లీం మైనార్టీలు దేశం వదిలి వెళ్లాల్సి వస్తోందని వైసీపీ నాయకులు మజీదులు, ప్రార్థనా స్థలాల వద్దకు వెళ్లి మరీ ముస్లింలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. రాజకీయ లబ్ధికోసం భయపెట్టడం దారుణమన్నారు. భారతదేశంలో పుట్టి పెరిగిన ఏ ఒక్క ముస్లిం మైనార్టీకి సీఏఏ వర్తించదని అన్నారు. నాడు పార్లమెంట్‌లోని ఉభయ సభల్లో వైసీపీ మద్దతు తెలిపాకే ఎన్‌డీఏ ప్రభుత్వం ఆమోదం తెలిపిందని గుర్తుచేశారు. వైసీపీ హయాంలో ఎక్కడ చూసినా వక్ఫ్‌భూముల సర్వే నెంబర్లు మార్చి వైసీపీ నాయకులు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. కర్నూలు నగరంలో ఆగ్రో ఇండస్ట్రీస్‌కు చెందిన స్థలాన్ని ఆక్రమించుకొని వైసీపీ కార్యాలయాన్ని నిర్మించారని ఆయన ఆరోపించారు వైసీపీ చేస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని బైరెడ్డి ముస్లింకు సూచించారు.

టీడీపీలో చేరిక

పాములపాడు మండలం చెలిమిల్ల గ్రామంలోని వైసీపీ కార్యకర్తలు శనివారం టీడీపీలో చేరారు. గ్రామానికి చెందిన 40 వైసీపీ కుటుంబాలు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరాయి. గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి, పెద్ద రాజశేఖర్, మధుకుమార్, అబ్రహామ్, కిషోర్, ప్రశాంత్, కల్లుబండి రవికుమార్ ,వేముల గోపి, రాజ్, స్వాములు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీల సంక్షేమం: మాండ్ర



పాసు పుస్తకాల జిరాక్స్ ప్రతులను దహనం చేస్తున్న మాండ్ర శివానందరెడ్డి, జయసూర్య, రైతులు

నందికొట్కూరు రూరల్, మార్చి 30: టీడీపీతోనే బీసీల సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. శనివారం నందికొట్కూరు మండలంలోని కొణిదేల గ్రామంలో ఏర్పాటు చేసిన జయహో బీసీ సదస్సులో మాండ్రతో పాటు నందికొట్కూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జయసూర్య మాట్లాడారు. రాష్ట్రంలో మొట్ట మొదటిగా బీసీలకు న్యాయం చేసిన పార్టీ తెలుగుదేశం అని అన్నారు. పాసు పుస్తకాలపై జగన్ ప్రతిమ ఉండడంతో జిరాక్స్ ప్రతులను రైతుల ఆధ్వర్యంలో దహనం చేశారు. కార్యక్రమంలో నందికొట్కూరు టీడీపీ మండల కన్వీనర్ ఓబుల్ రెడ్డి, అల్లూరు గ్రామ సర్పంచ్ నాగలక్ష్మయ్య, వడ్డెమాను సర్పంచ్ రామచంద్రుడు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

- టీడీపీ అధినేత చంద్రబాబుతోనే ప్రజా సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. శనివారం నందికొట్కూరు మండలంలోని అల్లూరు గ్రామంలో మాండ్ర సమక్షంలో పాములపాడు మండలంలోని ఇస్కాల గ్రామ వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. స్వామన్న రాముడు, చిరంజీవి, లింగన్న, వెంకటేష్, 20 కుటుంబాలు టీడీపీలో చేరాయి. మాండ్ర సురేంద్ర నాథరెడ్డి, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జయసూర్య, రమణారెడ్డి, నాగలక్ష్మయ్యామహేశ్వరెడ్డి, ఏసన్న, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి కృషి: బుడ్డా



టీడీపీలో చేరిన నాయకులతో మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

వెలుగోడు, మార్చి 30: శ్రీశైల నియోజక వర్గంలో అధిక శాతం వ్యవసాయ రైతులే ఉన్నారని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని శ్రీశైల నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. శనివారం వెలుగోడు పట్టణంలో పలువురు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వైసీపీకి సీనియర్ నాయకుడు, సింగిల్ విండో మాజీ చైర్మన్ మండ్ల శివశంకరరెడ్డి ఆధ్వర్యంలో ప్రవీణ్‌కుమార్ రెడ్డి, రఘుస్వామి రెడ్డి, పుల్లంరాజు, దర్గా బాదుల్లా, శ్రీనివాసులు ఉప్పరి రమణ, సుమారు వంద కుటుంబాలు చేరాయి. అలాగే టీడీపీ కార్యాలయంలో మరో 20 చెంచు కుటుంబాలు టీడీపీలో చేరాయి. బుడ్డా మాట్లాడుతూ వెలుగోడు జలాశయం కింద రైతులు రెండు కార్లు పంటలు పండించేవారని, అయితే శిల్పా నిర్లక్ష్యంతో జలాశయం నింపలేక రైతులు ఎంతో నష్ట పోతున్నారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అన్నారపు శేషిరెడ్డి, మాజీ ఎంపీపీ ఎల్లాల కృష్ణుడు, బోయ రేవుల సర్పంచ్ పెద్ద స్వామన్న, రామానాయుడు, జాకిర్ హుసేన్ అమీర్ అలీఖాన్, వెంకట రమణ, పాల శంకరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు కుర్చీల విరాళం

నందికొట్కూరు మార్చి 30: నందికొట్కూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు శ్రీరామ థియేటర్ యజమాని రామిరెడ్డి వంద కుర్చీలు విరాళంగా అందించారు. డిగ్రీ కళాశాల నందికొట్కూరు నూతన సెమినార్ భవనానికి విద్యార్థులు చదువుకోవడానికి మరియు పరీక్షలు రాయడానికి కుర్చీలు అందించారు. ప్రిన్సిపాల్ డా.ఆర్.సునీత మాట్లాడుతూ రామిరెడ్డి గొప్ప ఔదార్యగుణానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

'అనుమతి లేకుండా రాజకీయ పోస్టర్లు వేయకూడదు'



మాట్లాడుతున్న కమిషనర్ నిరంజన్‌రెడ్డి

నంద్యాల టౌన్, మార్చి 30: నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో అనుమతులు లేకుండా రాజకీయ పార్టీలకు సంబంధించిన బ్యానర్లు, పోస్టర్లను హోర్డింగ్‌లపై వేయరాదని మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి ఆదేశించారు. శనివారం తన చాంబర్‌లో పట్టణ ప్రణాళికా విభాగం ఆధ్వర్యంలో వివిధ అడ్వటైజ్‌మెంట్ సంస్థలకు చెందిన ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ముందస్తు అనుమతులు లేకుండా రాజకీయ పార్టీల బ్యానర్లు, యాడ్స్‌ను హోర్డింగ్‌లు, అడ్వటైజింగ్ బోర్డులపై వేయకూడదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'న్యాయం చేయాలి'

శ్రీశైలం, మార్చి 30: శ్రీశైలానికి సమీపంలోని కైలాసద్వారం వద్ద ఉగాది మహోత్సవాలకు విచ్చేసే భక్తులకు తాము కొబ్బరికాయలు విక్రయించుకునే విధంగా అవకాశం కల్పించాలని మేకలబండ చెంచు గిరిజనులు శనివారం అటవీశాఖ అధికారులను వేడుకున్నారు. సుండిపెంటలోని రేంజ్ అధికారి కార్యాలయం వద్ద మేకలబండ చెంచుగిరిజనులు ఆందోళన వ్యక్తం చేశారు. పూర్వకాలం నుంచి మేకలబండ వద్ద చెంచులు మాత్రమే కొబ్బరికాయలను అమ్ముకుని జీవించేవారన్నారు. ఇటీవల కాలం నుంచి కొందరు తమకు పోటీ వస్తూ గిరిజనుల పేరుతో ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశార్లు. శ్రీశైలం అటవీశాఖ అధికారి నరసింహులును వివరణ కోరగా కొత్తగా వచ్చిన డీఎఫ్‌వో తొమ్మిది మంది సుగాలీ గిరిజనులకు అవకాశం కల్పిస్తూ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. ఉత్తర్వులు వచ్చినప్పటికీ, కైలాసద్వారం మండపం వద్ద చెంచులకు సమప్రాధాన్యంగా దుకాణాలు కేటాయించాలని కోరుతున్నారు.

టీడీపీ కార్యకర్త మృతి

బేతంచెర్ల, మార్చి 30: మండలంలోని కొమ్మూరి కొట్టాల గ్రామానికి చెందిన దాసరి మురళి (28) టీడీపీ కార్యకర్త శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి, బేతంచెర్ల పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి, టీడీపీ మండల సమన్వయకర్త చంద్రశేఖర్, టీడీపీ కార్యకర్తలు మురళి భౌతిక కాయంపై పూలమాలలు వేసి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నారాయణ స్వామి తదితరులు ఉన్నారు.

టీడీపీతోనే బీసీలకు న్యాయం

డోన్(రూరల్), మార్చి 30: తెలుగుదేశం పార్టీతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని డోన్ వాల్మీకి సంఘం నేత, ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి సీలం భాస్కర్ నాయుడు అన్నారు. శనివారం పట్టణంలోని వెంకటనాయునిపల్లె గ్రామ సర్పంచ్ సీలం చంద్రశేఖర్ నాయుడు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతపురం జిల్లా గుంతకల్లు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా గుమ్మనూరు జయరాంకు టీడీపీ రాష్ట్ర అధిష్టానం టికెట్ కేటాయించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు తిరుపాల్, తిమ్మరాజు, అమర్, క్రిష్ణయ్య, తిమ్మయ్య, ఆనంద్ పాల్గొన్నారు.

అల్లూరు గ్రామంలో నీటి సమస్య



ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న గ్రామస్థులు

ఉయ్యాలవాడ, మార్చి 30: మండలంలోని అల్లూరు గ్రామ దళిత కాలనీలో వాసులకు తాగునీటి కష్టాలు తప్పటం లేదు. గత వారం రోజులుగా కాలనీలో నీరు అందటం లేదని 50 కుటుంబాల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారి తాగునీటి కష్టాలను గ్రామ పెద్దలు గుర్తించి ట్యాంకర్‌ను ఏర్పాటు చేశారు. రోజులు రెండు, మూడుసార్లు మాత్రమే ట్యాంకర్ వస్తుందని అవి సరిపోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కొళాయిలకు నీళ్ల వచ్చేలా చేయాలని కోరుతున్నారు. గ్రామ కార్యదర్శి రహీమ్‌ను వివరణ కోరగా కుందూనదిలో నీళ్ల లేకపోవటం వల్ల కొళాయిలకు నీళ్ల సరఫరా చేయలేక పోతున్నామన్నారు. రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించి నీళ్ల అందేలా చేస్తామని ఆయన తెలిపారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

కోవెలకుంట్ల, మార్చి 30: త్వరలో జరిగే ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించాలని రెవెన్యూ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఈశ్వరయ్య పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల నియమావళి ప్రకారం ప్రజలు రూ.50 వేల నగదు కంటే ఎక్కువగా తీసుకొని వెళ్లేవారు సరైన పత్రాలు లేకపోతే సీజ్ చేస్తామని పేర్కొన్నారు. బ్యాంకులో ప్రజలు రూ. 50 వేలకు మించి నగదు డ్రా చేయాలంటే సదరు బ్యాంక్ మేనేజర్ వద్ద నిబంధనల మేరకు అనుమతులు తప్పని పరిస్థితి అన్నారు. రాజకీయ పార్టీల నాయకులు, ఇతర సిబ్బంది ఎన్నికల నిబంధనలు పాటించి, అధికారులకు సహకరించాలని కోరారు.

ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు

రుద్రవరం, మార్చి 30 : ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం తగదని వైద్యాధికారి అమర్‌నాథరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ముత్తులూరు గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో తరలివచ్చిన వారికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనారోగ్యంగా ఉంటే ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను సంప్రదించాలని సూచించారు. వేసవి సమీపిస్తుంది, ఎండకు ఎక్కువ బయట తిరగరాదని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈసీ రత్తాలు, హెల్త్ సూపర్‌వైజరు బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

చార్ కమాన్ మసీదులో ఇఫ్తార్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బీసీ

బనగానపల్లె, ఏప్రిల్ 30: పట్టణంలోని కొండపేటలోని చార్ కమాన్ మసీదులో శనివారం నిర్వహించిన ఇఫ్తార్ విందుకు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి హాజరయ్యారు. ముజీబ్, హాజీ షారూక్, ఫైరోజ్‌ఖాన్ ఈ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. చార్‌కమాన్ మసీద్ పేష్మామ్‌ను బీసీ సత్కరించారు. బీసీ మాట్లాడుతూ ఎంతో పవిత్రమైన ఈమాసంలో ముస్లింలకు అంతా మంచి జరుగాలని కోరారు. ముస్లింల అభివృద్ధికి టీడీపీ కట్టుబడి ఉందన్నారు.

ఎన్నికల సిబ్బందికి శిక్షణా తరగతులు

బనగానపల్లె, ఏప్రిల్ 30: పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో బనగానపల్లె నియోజకర్గంలోని ఎన్నికల సిబ్బంది ఏపీవో, అసిస్టెంట్ ఏపీవోలకు నియోజకవర్గ స్థాయి శిక్షణతరగతులు శనివారం నిర్వహించారు. బనగానపల్లె రిటర్నింగ్ అధికారి కామేశ్వరరావు ఎన్నికల సిబ్బందికి ఎన్నికలకు సంబంధించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎన్నికలలు ఎలా నిర్వహిచాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వివరించారు. కార్యక్రమంలో కొలిమిగుండ్ల, అవుకు, బనగానపల్లె, కోవెలకుంట్ల, సంజామల మండలాలకు చెందిన ఎన్నికల ఏపీవోలు, అసిస్టెంట్ ఏపీవోలు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ, మార్చి 30: త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో కీలక పాత్ర పోషించే పీవో, ఏపీవోలకు ఆళ్లగడ్డ అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి, నంద్యాల ఆర్డీవో మల్లికార్జున రెడ్డి శనివారం శిక్షణ ఇచ్చారు. పట్టణంలోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో పీవో, ఏపీవోలను ఈవీఎంల ద్వారా మాక్ పోల్ నిర్వహించారు ఈవీఎంలను ఎలా నిర్వహించాలి, పోలింగ్ జరిగే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో సహయ ఎన్నికల అధికారి నజీర్ అహమ్మద్, అసెంబ్లీ పరిధిలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలు పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం

అవుకు, మార్చి 30: అవుకు మండలం కునుకుంట్ల గ్రామానికి చెందిన కంబగిరి స్వామి అనే నాటుసారా విక్రేతను అరెస్ట్ చేసి 50 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ కిరణ్‌బాబు శనివారం తెలిపారు. ఎస్‌ఐ మాట్లాడుతూ కంబగిరి స్వామిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నాటుసారా తయారు చేసిన, విక్రయించినా చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు.

చంద్రబాబు నాయుడును
విమర్శించే స్థాయి రామిరెడ్డికి లేదు

- మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, ఏప్రిల్ 30: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడును విమర్శించే స్థాయి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి లేదని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో విలేఖర్ల సమావేశంలో బీసీ మాట్లాడుతూ చంద్రబాబునాయుడు రుణమాఫీ చేయలేదని రామిరెడ్డి అంటున్నారని, ప్రతి రైతుకు రూ.లక్ష వరకు గత టీడీపీ ప్రభుత్వం చేసిందని, దీనికి రుజువులు చూపుతామని అన్నారు. జగన్ నవరత్నాలు అమలు చేస్తామని అధికారంలోకి వచ్చి, నిబంధనలు విధించి పేదల పొట్టకొట్టారని అన్నారు. అమ్మఒడి ఇంట్లోని పిల్లలందరికీ ఇస్తానని చెప్పి మోసం చేశారన్నారు. 2014 నుంచి 2019 వరకు డ్వాక్రా రుణాలకు వడ్డీలు మాఫీ చేస్తామని చెప్పి కొంతమంది డ్వాక్రా మహిళలకే మాఫీ చేసి మిగతా వారికి అన్యాయం చేశారన్నారు. రైతులకు రూ.13వేలు ఆర్థికసాయం చేస్తాననిచెప్పి కేవలం రూ.6500 ఇచ్చారని, అదీ కేంద్రం ఇచ్చిన రూ.6వేలు కలిపి ఇచ్చారని అన్నారు. ఎస్సీ ఎస్టీ, మైనార్టీలకు 45 ఏళ్లకే పింఛన్ ఇస్తామని జగన్ వారిని ముంచారన్నారు. రవ్వలకొండలో రామిరెడ్డి అక్రమ మైనింగ్ చేస్తుండటంతో చంద్రబాబు రవ్వలకొండను



మాట్లాడుతున్న బీసీ జనార్దన్‌రెడ్డి

మింగిన అనకొండ కాటసాని అన్నారని తెలిపారు. జీఎన్ఎస్ఎస్ సిమెంట్ లైనింగ్ వేసి రూ. కోట్లు కమీషన్‌లు దండుకున్న వ్యక్తి కాటసాని అన్నారు. కమ్యూనిటీ హాళ్లకు, షాదీఖానాకు తేడా తెలియనివ్యక్తి ఎమ్మెల్యే ఉండటం దురదృష్టకరమన్నారు. విలేఖర్ల సమావేశంలో బొబ్బల గోపాల్‌రెడ్డి, టంగుటూరు శ్రీనయ్య, దొనపాటి భస్కర్‌రెడ్డి, రాయలసీమ సలాం, భూషన్న, పూలకలాం, గౌండా బాబు, రజాక్, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ జెండా పీకేయడం ఖాయం

● మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ



కోట్ల సుజాతమ్మ సమక్షంలో టీడీపీలో చేరిన గోసానిపల్లి వైసీపీ కార్యకర్తలు

డోన్, మార్చి 30: డోన్ నియోజకవర్గంలో వైసీపీ జెండాను పీకేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. శనివారం మండలంలోని గోసానిపల్లి గ్రామంలో ఆమె ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని వైసీపీకి చెందిన 20 కుటుంబాలు కోట్ల సుజాతమ్మ సమక్షంలో టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా కోట్ల సుజాతమ్మ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం నిత్యావసర ధరలు ఇష్టారాజ్యంగా నిత్యావసర ధరలు పెంచేసి సామాన్యుల జేబులను గుల్ల చేసిందని మండిపడ్డారు. డోన్ నియోజకవర్గంలోని ఏ పల్లెకు వెళ్లినా తాము చేసిన అభివృద్ధే కనిపిస్తుందని, మంత్రి బుగ్గన చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. చంద్రబాబు సభలకు జనం ప్రభంజనంలా తరలివస్తుంటే.. జగన్ సభలు వెలవెలబోతున్నాయంటే వైసీపీని ఓడిపోవడం ఖాయమని తెలిసిపోయిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామక్రిష్ణ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాసులు యాదవ్, మిద్దెపల్లి గోవిందు, మాజీ సర్పంచ్ శ్రీరాములు, మల్లయ్య, వెంకటాపురం పెద్దయ్య పాల్గొన్నారు.

టీడీపీతోనే పేదల జీవితాల్లో వెలుగులు

● కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి



పీఆర్‌పల్లిలో నాగేశ్వరరావు యాదవ్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన వైసీపీ వర్గీయులు

ప్యాపిలి, మార్చి 30: టీడీపీ మేనిఫెస్టోతో పేదల జీవితాల్లో వెలుగులు నిండుతాని మాజీ కేంద్ర మంత్రి, టీడీపీ డోన్ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పీఆర్‌పల్లి, వెంకటకొండాపురం, పెద్దపాయి, చంద్రపల్లి గ్రామాల్లో ఆయన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కోట్ల మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే రైతులు, మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తామన్నారు. యువతకు నిరుద్యోగభృతి ఇవ్వడంతో పాటు ఏటా జాబు క్యాలెండర్ ద్వారా ఉద్యోగాలు భర్తీ చేస్తామని తెలిపారు.. ఒక్కసారి అవకాశం ఇవ్వండంటూ అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అథోగతిపాలు చేశారన్నారు. ప్రస్తుతం దివాల స్థితిలో ఉన్న రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగుపడాలంటే టీడీపీ అధికారంలోకి రావాలన్నారు. ఇందుకోసం ప్రజలు చంద్రబాబును ఆదరించాలని ఆయన కోరారు. పీఆర్‌పల్లి గ్రామంలో టీడీపీ రాష్ట్ర బీసీ సాధికార సమితి కన్వినర్ వై నాగేశ్వరరావుయాదవ్ ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన 20 కుటుంబాలు కోట్ల సమక్షంలో టీడీపీలోకి చేరారు. కార్యక్రమంలో నాయకులు వై లక్ష్మినారాయణయాదవ్, టి శ్రీనివాసులు, ఆర్‌ఈ నాగరాజు, గండికోట రామసుబ్బయ్య, రామ్మోహన్‌యాదవ్, జయరామిరెడ్డి, నాగేశ్వర, రామాంజినేయులు, అల్లే శ్రీరామిరెడ్డి, రంగారెడ్డి, సురేంద్రగౌడు తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా : ఆరుగురికి గాయాలు

కోవెలకుంట్ల, మార్చి 30: కంపమల్ల మెట్ట సమీపంలో శనివారం ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. దొర్నిపాడు మండలం కిష్టిపాడు గ్రామానికి చెందిన 6 మంది ఆటోలో కోవెలకుంట్లకు వెళ్తుండగా కంపమల్ల మెట్ట సమీపంలోకి వచ్చేసరికి ఆటోఅదుపు తప్పి బోల్తాపడడంతో 6 మందికి స్వల్ప గాయాలయ్యాయి.

అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యే

నంద్యాల, మార్చి 30, ఆంధ్రజ్యోతి: ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి తన పదవి కాలంలో అవినీతికి పాల్పడ్డాడని టీడీపీ యువ నాయకుడు ఎర్రగుడిదిన్నె గంగుల ప్రహ్లాదరెడ్డి ఆరోపించారు. ఆళ్లగడ్డ పట్టణంలోని మాజీ మంత్రి అఖిలప్రియ ఇంటిలో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ సబ్ స్టేషన్లలో కాంట్రాక్టు ఉద్యోగులు ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.8 లక్షలు, ఆళ్లగడ్డ మున్సిపాల్టీలో కాంట్రాక్టు ఉద్యోగుల నియామకం పేరుతో రూ. లక్షలు వసూలు చేశారని ఆరోపించారు. మున్సిపాల్టీలో బ్లీచింగ్ పౌడరు సరఫరా కోసం తన సొంత బంధువుకు కాంట్రాక్టు ఇప్పించి రూ.లక్షలు దండుకున్నారని తెలిపారు. ఎర్రగుడిదిన్నెలో తన స్థలాన్ని అక్రమించుకొని ప్యాలెస్ నిర్మించారని చెప్పారు. సమావేశంలో టీడీపీ నాయకులు సింగం భరత్‌రెడ్డి, బాలీశ్వరరెడ్డి పాల్గొన్నారు

గుండెపోటుతో లారీ క్లీనర్ మృతి

కొలిమిగుండ్ల ,మార్చి 30: మండలంలోని తుమ్మలపెంట గ్రామ సమీపంలోని లారీ క్లీనర్ జి.రామిరెడ్డి (43) గుండెపోటుతో శనివారం మృతి చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ నరసింహులు తెలిపారు. కృష్ణా జిల్లా ,చందలపాడు మండలం, బొబ్బలపాడు గ్రామానికి చెందిన మృతుడు రామిరెడ్డి గత 28వ తేదీన మట్టి లారీతో అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీకి వచ్చారు. గుండెపోటుకు గురై మృతి చెందాడని మృతుడి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తెలుగు ప్రొఫెషనల్ వింగ్ ఏర్పాటు

డోన్, మార్చి 30: డోన్ నియోజకవర్గ తెలుగు ప్రొఫెషనల్ వింగ్ నూతన కార్యవర్గాన్ని శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్రికే ఫణిరాజ్, టీపీ డబ్ల్యూ నంద్యాల పార్లమెంటు అధ్యక్షులు డా.మంజునాథ్ ఆధ్వర్యంలో నియోకవర్గ కమిటీ అధ్యక్షుడిగా టీఈ రాఘవేంద్రగౌడును ఎన్నుకున్నారు. జనరల్ సెక్రటరీగా మాధవరం రాము, రాఘవగౌడు, బేతంచెర్ల అబ్దుల్ సలామ్‌లను ఎన్నుకున్నారు. టీపీడబ్ల్యూ కమిటీ నాయకులు మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మను కలిశారు. కార్యక్రమంలో కోట్ల నివేధిత, రాజశేఖర్, వీరాంజి, భైరెడ్డి అనిల్, చిట్యాల మధు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్ర అభివృద్ధి

డోన్(రూరల్), మార్చి 30: తెలుగుదేశంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని బీసీ జాతీయ సంక్షేమ జాతీయ ప్రదాన కార్యదర్శి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్ అన్నారు. శనివారం డోన్ పట్టణంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణతో కలిసి వై.నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ టీడీపీ విజయానికి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. ఈ సమావేశంలో డోన్ పట్టణ ప్రధాన కార్యదర్శి తాడూరి రంగనాథ్, రాష్ట్ర బీసీ సంక్షేమ కార్యదర్శి ఎస్ఎండీ రఫీ, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రామ్మోహన్, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, క్లస్టర్ ఇన్‌చార్జి మిద్దెపల్లి గోవిందు, ఆలేబాదు ప్రకాష్ శ్రీరాములు, బూత్ ఇన్‌చార్జి సుధాకర్, గార్లదిన్నె సర్పంచ్ అభ్యర్థి ప్రణీత్, పెద్దగౌడు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

సంజామల, మార్చి 30: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ రమేశ్ రెడ్డి శనివారం తెలిపారు. ఆళ్లగడ్డ గ్రామం జంబులదిన్నె గ్రామానికి చెందిన ఎర్రవాళ్ల వెంకటరమణ అనే వ్యక్తి పేరుసోముల గాలేరునగరి కాల్వవద్ద మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో దాడులు నిర్వహించామన్నారు. నిందితుడి వద్ద 30 క్వార్టరు సీసాలు స్వాధీనసరచుకొని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రమేశ్ రెడ్డి వివరించారు.

మహిళ మృతి

ఆళ్లగడ్డ, మార్చి 30: ఆళ్లగడ్డ పట్టణ పరిధిలోని పి.చింతకుంట గ్రామం వద్ద శనివారం కారు, ఆటో ఢీ కొన్న ప్రమాదంలో టి.లింగందిన్నె గ్రామానికి చెందిన రమణమ్మ(36) మృతి చెందారు. మిరప పంటలో పండు మిరప కాయలు కోసేందుకు కూలీకి వచ్చిన మృతురాలు ఈ ప్రమాదానికి గురైంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసున్నారు.

రూ.5.18 లక్షల నగదు పట్టివేత

నంద్యాల, మార్చి 30, ఆంధ్రజ్యోతి: పట్టణంలోని పాతబస్టాండులో రూ.5.18 లక్షల నగదును ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు శనివారం రాత్రి పట్టుకున్నారు. పాతబస్టాండులో వాహనాల తనిఖీ చేస్తుండగా ఈ నగదు లభ్యమైనట్లు స్క్వాడ్ ఫ్లైయింగ్ అధికారి రమేష్‌బాబు చెప్పారు. ఈ నగదుకు సంబంధించి పట్టణానికి చెందిన సుబ్బరాయుడు ఆధారాలు చూపక పోవడంతో నగదును జిల్లా ఎన్నికల అధికారికి పంపినట్లు ఆయన చెప్పారు.

బొప్పాయికి చీరలే రక్షణ

● వైరస్‌తో దెబ్బతిన్న పంట ● ఆందోళనలో రైతులు



బొప్పాయి పండ్లకు చీరలు కడుతున్న రైతు



చిన్నవంగలిలో బొప్పాయి పండ్లకు కట్టిన చీరలు

చాగలమర్రి, మార్చి 30: బొప్పాయి పండ్లకు చీరలే రక్షణగా నిలిస్తున్నాయి. చిన్నవంగలి గ్రామంలో 300 ఎకరాల్లో రైతులు బొప్పాయి పంట సాగు చేశారు. వైరస్ వల్ల పంట దెబ్బతిని రైతులకు నష్టం వాటిల్లింది. టన్ను ధర రూ.14 వేలు పలుకుతోంది. ధర ఉన్నా దిగుబడి లేక రైతులు ఆవేదన చెందుతున్నారు. చెట్లకు ఉన్న బొప్పాయి పండ్లను కాపాడుకోవడానికి రైతులు వినూత్న ప్రయోగాలు చేస్తున్నాయి. బొప్పాయి ఎండ ప్రభావంతో దెబ్బతింటున్నాయి. దీంతో రైతు బికారి సాహెబ్ పాత చీరలతో 2 ఎకరాల బొప్పాయి తోటను కాపాడుకుంటున్నారు. ఒక్కో చీర రూ.20 ప్రకారం కొనుగోలు చేసి బొప్పాయి కాయలకు చుట్టేశారు. తోటలోని మొక్కలకంతా చీరలు కట్టి పండ్లను కాపాడుకునేందుకు ప్రయత్నం చేశాడు. పండ్లను కోసే వరకు దెబ్బతినకుండా ఉంటాయని రైతు పేర్కొన్నారు. రూ.2 లక్షల దాక ఖర్చు చేశామని అన్నారు.

తరలివెళ్లిన తెలుగు తమ్ముళ్లు

బేతంచెర్ల, మార్చి 30: డోన్ పట్టణంలో డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనానికి బేతంచెర్ల నుంచి వందల వాహనాల్లో టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి, డోన్ బీసీ సెల్ అధ్యక్షులు ఎర్రమల నాయుడు, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో భారీగా వందలాదిగా నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. కార్యక్రమంలో వార్డుల కౌన్సిలర్లు రామగోపాల్, రామ్మూర్తి, నంద్యాల మధు, నారాయణస్వామి, బీసీ సెల్ నాయకులు లోకేశ్‌గౌడు, టీడీపీ కార్యకర్తలు తరలివెళ్లారు.

వైసీపీని సాగనంపండి



ప్రజలతో మాట్లాడుతున్న అఖిలప్రియ

చాగలమర్రి, మార్చి 30: రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీని సాగనంపాలని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. శనివారం చాగలమర్రి గ్రామంలోని ఎస్‌బీఐ కాలనీ, బందేషావలి దర్గా వీధిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బందేషావలి దర్గాలోప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరిస్తూ ప్రచారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అన్సర్‌బాషా, సల్లా నాగరాజు, గుత్తి నరసింహులు, జెట్టి నాగరాజు, కొలిమి ఉసేన్‌వలి, కొలిమి షరీఫ్, మౌలాలి, అనిఫ్, అజీమ్, కరిముల్లా, గఫార్, రవి, రజాక్, అబ్దుల్లా, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పతనం ఖాయం

రుద్రవరం, మార్చి 30 : రాష్ట్రంలో వైసీపీ పతనం ఖాయమని మాజీమంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడు వస్తాయా, ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

● మండలంలోని ముత్తులూరు గ్రామానికి చెందిన పద్మనాభరెడ్డి, బాలరామలింగారెడ్డి, లింగారెడ్డి, రామలింగారెడ్డి వీరితో పాటు మరికొన్ని కుటుంబాలు మాజీ మంత్రిభూమా అఖిలప్రియ సమక్షంలో టీడీపీలో చేరారు. చేరిన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పోలా గురుమూర్తి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ వెంటే ప్రజలు

దొర్నిపాడు, మార్చి 30: రాష్ట్రంలో వైసీపీ పాలనతో ప్రజలు విసిగి పోయి టీడీపీ వెంట నడిచేందుకు సిద్ధంగా ఉన్నారని ఆళ్లగడ్డ టీడీపీ యువనాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కొండాపురం గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో చవ్వ అమరసింహారెడ్డి, అంకిరెడ్డి, చవ్వ శివకుమార్‌రెడ్డి, మండల టీడీపీ కార్యదర్శి కొత్తపల్లి సురేంద్ర, చౌడు వెంకటేశ్వర్‌రెడ్డి, దయానందరావు ఉన్నారు.

వ్యక్తి మృతి

రుద్రవరం, మార్చి 30: మండలంలోని లింగందిన్నె పంచాయతీ మజరా రామాపురం గ్రామానికి చెందిన హుసేన్‌సా (61) అనే వ్యక్తి శనివారం మృతి చెందాడు. టీడీపీ యువ నాయకుడు భూమా జగద్విఖ్యాత్‌రెడ్డి గ్రామానికి చేరుకుని హుసేన్ షా భౌతికకాయంపై పూలమాల వేసి నివాలులర్పించారు. కార్యక్రమంలో రెక్కల మనోహర్‌రెడ్డి, ఎస్సీ సెల్ పార్లమెంటు కార్యదర్శి కొమ్మలపాటి రాజారావు, బీసీ సంఘం ఉపాధ్యక్షులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై కేసు నమోదు

ఉయ్యాలవాడ, మార్చి 30: ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ఎన్నికల కోడ్‌ను ఉల్లంగించిన ఇద్దరు ద్విచక్ర వాహన దారులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ, జనసేన పార్టీలకు చెందిన ఇద్దరు ద్విచక్ర వాహన దారులు తమ బైకులకు పార్టీల స్టిక్కర్లను అంటించుకొని మాయలూరు గ్రామంవైపు వెళ్తుండగా ఎన్నికల ఫైయింగ్ స్క్వాడ్ డిటీ షేక్ మహబూబ్‌బాషా గుర్తించి పోలీసులకు అప్పగించారు. వాటికి పంచనామ నిర్వహించి పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి: సీపీఎం



న్యాయవాది బద్దల వెంకటేశ్‌ను అభినందిస్తున్న తోటి న్యాయవాదులు

డోన్(రూరల్), మార్చి 30: డోన్ పట్టణంలో గుత్తి రోడ్డు ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ భూములను కాపాడాలని సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు కోయలకొండ నాగరాజు, నక్కి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు డోన్ తహసీల్దార్ మాధవ కృష్ణారెడ్డికి కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ భూములను ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుంచి ప్రభుత్వ భూమిని కాపాడాలని, లేనిపక్షంలో పేదలను సమీకరించి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు చిన్న రెహిమాన్ తదితరులు ఉన్నారు.

బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్

డోన్(రూరల్), మార్చి 30: డోన్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో న్యాయవా ది బద్దల వెంకటేశ్ గెలుపొందారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడుగా జరిగిన ఎన్నిక్లలో గెలుపొందిన బద్దల వెంకటేశ్‌కు శనివారం తోటి న్యాయవాదులు పూలమాలలు వేసి సత్కరించారు. న్యాయవాదులు కాశీం సాహెబ్, కల్ల మహేశ్వరరెడ్డి, శ్రీనివాస్ భట్‌లు అభినందనలు తెలిపారు.

ధ్యానంతోనే ఆరోగ్యం

బనగానపల్లె, ఏప్రిల్ 30: ధ్యానంతోనే మనిషి ఆరోగ్యంగా ఉంటారని ధ్యాన గురువు లక్ష్మి అన్నారు. మండలంలోని నందవరంలో పిరమిడ్ స్పిరిటువల్ సొసైటీ మూమెంట్ ఆధ్వర్యంలో శనివారం అఖండ ధ్యాన కార్యక్రమం నిర్వహించారు. అఖండ ధ్యానంలో పిరమిడ్ మాస్టర్లు ధ్యానం యొక్క ప్రాధాన్యతను వివరించారు. ఆత్మచైతన్యంతో ముందుకు వెళ్లాలన్నారు. ఆత్మచైతన్యంతో మరింత ముందుకు వెళ్లడానికి 18 ఆదర్శ సూత్రాలను ఆనందంగా అనుభవించి మరింత ముందుకు తీసుకువెళ్ళారన్నారు. కార్యక్రమంలో పీఆర్ వెంకటేశ్వర్లు, నంద్యాల, బండి ఆత్మకూరు ఆళ్లగడ్డ, పాణ్యం, బేతంచెర్ల మండల పిరమిడ్ మాస్టర్లు పాల్గొన్నారు.

వెంకటేశ్వరుడికి లక్ష కుంకుమార్చన

రుద్రవరం, మార్చి 30 : మండలంలోని వాసాపురంలో కొలువుదీరిన వెంకటేశ్వరస్వామి లక్ష్మి గోదాదేవి అమ్మవారు, మానస లింగేశ్వరస్వామి త్రిపురసుందరీదేవి అమ్మవార్లకు శనివారం అర్చకులు వారణాసి గోపిశర్మ, శివశర్మలు అభిషేకాలు చేశారు. వెంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష కుంకుమార్చన వేదమంత్రోచ్చారణల మధ్య భక్తులు చేశారు. అలాగే స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

సంతాన వేణుగోపాలుడికి ప్రత్యేక పూజలు

రుద్రవరంలో శనివారం సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు నిత్య తృప్తదాస్ సంతాన వేణుగోపాలస్వామి సత్యభామ రుక్మిణీ అమ్మవార్లకు అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● రుద్రవరంలో కొలువుదీరిన వెంకటేశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు.

వీరాంజనేయస్వామికి విశేష పూజలు

చాగలమర్రి, మార్చి 30: చాగలమర్రి గ్రామంలోని గాంధీ బజార్‌లో వెలసిన వీరాంజనేయస్వామికి వేద పండితుల ఆధ్వర్యంలో శనివారం రాత్రి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. లోక కల్యాణార్థం ప్రజలు సుభిక్షంగా ఉండాలంటూ ఆంజనేయస్వామికి మహిళలు వ్రతం చేశారు. తమలపాకులతో పూజలు చేసి భజనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త శివప్రసాదు, అధ్యక్షుడు లక్ష్మణబాబు, మహిళలు పాల్గొన్నారు.